### విలేఖరులు కావలెను

ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..

స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్డు, నల్లగొండ-508001. ఫోన్ నెం: 9885826108.
E-mail: shanthimama@gmail.com



ప్రజల కోసం - ప్రకృతి కోసం - సామాన్యుని గొంతుగా - సామాజిక సమరంగా స్ఫూర్తి పబ్లికేషన్స్ వారి

# ధర్మఘంట

తెలుగు జాతీయ దిన పత్రిక

TELTEL/2012/47103

సంపుటి : 12 సంచిక :117 నల్గొండ | శుక్రవారం 25-07-2025 ఎడిటర్ : మేడే శాంతికుమార్ | పేజీలు : 4 వెల : రూ.1/-


## ముంబయి బాంబు పేలుళ్ల కేసు..మహారాష్ట్ర హైకోర్టు తీర్పుపై సుప్రీం స్టే



న్యూఢిల్లీ,జూలై24: 2006 ముంబయి బాంబు పేలుళ్ల కేసులో 12మంది నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు గురువారం స్టే విధించింది. హైకోర్టు తీర్పును ఒక ఉదాహరణగా పరిగణించరాదని జస్టిస్ ఎం.ఎం.సుందరేష్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులోని నిందితులందరికీ నోటీసులను జారీ చేసింది. అయితే నిందితులను జైలు నుండి విడుదల చేయడాన్ని నిలిపివేయలేదు. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం ఈ పిటిషన్ దాఖలు చేసింది. 2006 జులై 11న ముంబయిలోని ప్రత్యేక లోకల్ ట్రైన్‌లో 11నిమిషాల వ్యవధిలో ఏడు బాంబు పేలుళ్లు జరిగాయి.ఈ ఘటనలో 180మందికి పైగా మరణించారు. ముంబై శివారు వెస్టర్న్ లోకల్ రైళ్లలో జులై 11, 2006న జరిగిన ఏడు పేలుళ్లు భారతదేశ చరిత్రలో అత్యంత ఘోరమైన ఉగ్రవాద దాడుల్లో ఒకటిగా నిలిచాయి. సాయంత్రం రద్దీ సమయంలో జరిగిన ఈ దాడుల్లో 189 మంది ప్రాణాలు కోల్పోగా, 820 మందికి పైగా గాయపడ్డారు.

ఈ కేసులో 12 మంది నిందితులను మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ అరెస్టు చేసి, స్పెషల్ కోర్టు వారిని దోషులుగా తేల్చింది. ఐదుగురికి మరణశిక్ష, మిగిలిన ఏడుగురికి జీవిత ఖైదు విధించారు. అయితే, బాంబే హైకోర్టు ఇటీవల ఈ తీర్పును రద్దు చేస్తూ, నిందితులందరినీ నిర్దోషులుగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ కేసును స్వీకరించి, బాంబే హైకోర్టు తీర్పును స్టే చేసింది. మహారాష్ట్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. జస్టిస్ ఎం.ఎం. సుందరేష్, జస్టిస్ ఎన్.కె. సింగ్ బెంచ్ ముందు వాదిస్తూ, నిందితులను తిరిగి అరెస్టు చేయాలని కోరడం లేదని, కానీ బాంబే హైకోర్టు తీర్పులోని కొన్ని పరిశీలనలు మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్ యాక్ట్ కింద పెండింగ్‌లో ఉన్న ఇతర కేసులపై ప్రభావం చూపవచ్చని వాదించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీం కోర్టు, నిందితులను జైలుకు తిరిగి పంపాల్సిన అవసరం లేదని, అయితే హైకోర్టు తీర్పును ఇతర కేసులకు ప్రామాణికంగా పరిగణించరాదని ఆదేశించింది. దీని ప్రకారం, హైకోర్టు తీర్పు ప్రామాణిక విలువను మాత్రమే స్టే చేశారు. జూలై 21న, బాంబే హైకోర్టు జస్టిస్ అనిల్ కిలోర్, జస్టిస్ శ్యామ్ చందక్ బెంచ్, 12 మంది నిందితుల శిక్షను రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది. ప్రాసిక్యూషన్ వారిని దోషులుగా నిరూపించడంలో విఫలమైందని కోర్టు తెలిపింది. అంతేకాక, మహారాష్ట్ర ఆ-ఊా దర్యాప్తు పద్ధతులపై తీవ్ర విమర్శలు చేసింది. నిందితులు కస్టడీలో హింసకు గురయ్యారని, దర్యాప్తు అధికారులు ఫలితాల కోసం ఒత్తిడికి గురిచేశారని హైకోర్టు ప్రస్తావించింది. సుప్రీంకోర్టు ఇప్పుడు ఈ కేసును విచారణకు స్వీకరించడంతో, బాంబే హైకోర్టు సమర్పించిన ఆధారాలు, న్యాయపరమైన తీర్మానాలపై తుది నిర్ణయం ఆధారపడి ఉంటుంది. ఈ కేసు భారత న్యాయ వ్యవస్థలో ఉగ్రవాద ఆరోపణలు, దర్యాప్తు పద్ధతులపై మరింత చర్చకు దారితీసే అవకాశం ఉంది.

## తెలంగాణలో చేపట్టిన సర్వే దేశానికి ఆదర్శం కావాలి: ఖర్గే

ఢిల్లీ: తెలంగాణలో శాస్త్రీయంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వే దేశానికి ఆదర్శం కావాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉద్ఘాటించారు. తెలంగాణ సర్వే ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యాసంస్థల్లో ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సిఫారసు చేస్తోందని తెలిపారు. బీసీ బిల్లు ప్రస్తుతం రాష్ట్రపతి ఆమోదం కోసం ఎదురు చూస్తోందని వెల్లడించారు. ఈ చారిత్రాత్మక ప్రయత్నంలో కృషి చేసిన విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలోని బృందానికి కృతజ్ఞతలు తెలిపారు మల్లికార్జున ఖర్గే.కాంగ్రెస్ అధ్యక్షుడు, తెలంగాణ సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రిమండలి, ఎంపీలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో మల్లికార్జున ఖర్గే పోస్ట్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ సామాజిక న్యాయం 2.0 ఉద్యమాన్ని ప్రారంభించిందని చెప్పుకొచ్చారు. బలహీన వర్గాల కోసమే ఈ న్యాయ పోరాటమని నొక్కిచెప్పారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ నిరంతర పోరాటం చేస్తోందని ఉద్ఘాటించారు. దశాబ్దాలుగా పక్కకు నెట్టివేయబడిన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల ప్రజల గళంగా కాంగ్రెస్ పనిచేస్తోందని స్పష్టం చేశారు మల్లికార్జున ఖర్గే.దేశ జనాభాలో మెజార్టీ సంఖ్య అయినా కార్పొరేట్ బోర్డులు, న్యాయవ్యవస్థ, బ్యూరోక్రసీ, ఉన్నత విద్యాసంస్థల్లో వర్ణహీనత కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లో కూడా అన్యాయం జరుగుతోందని.. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించారని గుర్తుచేశారు. 80 శాతం ఓబీసీ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. అలాగే 83 శాతం ఎస్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. దేశవ్యాప్తంగా జాతీయ కుల గణాంకాల సమీక్ష జరపాలని డిమాండ్ చేశారు. ప్రజల ఒత్తిడికి లోనై కులగణనకు మోదీ ప్రభుత్వం అంగీకారం తెలిపిందని... కానీ 50 శాతం రిజర్వేషన్ పరిమితిని ఎందుకు తొలగించలేదని మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు.

కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉంది..!

ఢిల్లీలో మల్లికార్జున ఖర్గే నివాసంలో జరిగిన కీలక సమావేశం అనంతరం తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన కుల సర్వే విధివిధానాలు, ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలపై చర్చించామన్నారు. అలాగే



తెలంగాణలో కులగణన సర్వే శాస్త్రీయ బద్ధంగా చేసిన తీరుపై పార్టీ అగ్ర నేతలకు వివరించామని, రెండు గంటలపాటు సమావేశం జరిగిందన్నారు.మేం ఇచ్చిన సమాచారాన్ని రాహుల్ గాంధీ, ఖర్గే విన్నారని, కేంద్రంలో పెండింగ్లో ఉన్న బిల్లులపై వారికి వివరించామన్నారు. గవర్నర్ నుంచి కేంద్ర ప్రభుత్వానికి వచ్చిన బిల్లులు ఇక్కడ పెండింగ్ లో ఉన్నాయన్నారు. దీని కోసం రాష్ట్రం పంపిన బిల్లుల ఆమోదానికి కేంద్రంతో పోరాడాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఇంకా సుప్రీం కోర్టు రిజర్వేషన్ల క్యాప్ ను తొలగించేందుకు కేంద్రం పై ఒత్తిడి తెచ్చేలా పార్లమెంట్ లో పోరాడాలని కోరినట్లు తెలిపారు. మొత్తానికి తెలంగాణ ప్రభుత్వం చేయాల్సింది చేసింది.. కేంద్రం వద్ద పెండింగ్ లో ఉందని పేర్కొన్నారు. మరోవైపు, బీజేపీ బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉందన్నారు. శాసనసభలో బీజేపీ ఓటు వేసింది.. కానీ, కేంద్రం వద్దకు వచ్చే సరికి బీజేపీ యూటర్న్ తీసుకుందని తెలిపారు. దీనిపై 9వ షెడ్యూల్ లో చర్చ జరిపేందుకు కేంద్రంపై ఒత్తిడి తెస్తామన్నారు. అంతేకాకుండా తాము ఇండియా కూటమిలో ఉన్న అన్ని పార్టీల నేతలతో మాట్లాడుతామని చెప్పుకొచ్చారు. ఇక నేడు సాయంత్రం 5 గంటలకు ఇందిరా భవన్లో కాంగ్రెస్ ఎంపీలకు కుల గణనపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు ఇస్తారని ఆయన తెలిపారు. తెలంగాణ రోల్ మోడల్ గా మారిందని.. ఒకవేళ కేంద్రం ఆమోదం తెలపకుంటే.. రాహుల్ నేతృత్వంలో ఉద్యమం చేస్తామని ఆయన హెచ్చరించారు.


## కేటీఆర్ జన్మదినం సందర్భంగా బెంచీలు, సైకిళ్ల పంపిణీ

హైదరాబాద్ 24.07.2025 గురువారం, (ధర్మఘంట): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, డైనమిక్ లీడర్, మాజీమంత్రి కల్వకుంట్ల రామారావు (కేటీఆర్) జన్మదినాన్ని పురస్కరించుకుని సామాజిక సేవలో భాగంగా "గిఫ్ట్ ఏ స్మైల్" కార్యక్రమాన్ని నేడు మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ సహకారంతో తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ బోయిగూడలోని సెయింట్ ఫిలోమెనాస్ హైస్కూల్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్, మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొని "గిఫ్ట్ ఏ స్మైల్" కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు 100 బెంచీలు, అదే విదంగా 6వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు చదువులో మొదటి రెండు స్థానాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినీ విద్యార్థులకు 20 సైకిళ్లను పంపిణీ చేశారు.అనంతరం కేటీఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలని పాస్టర్లతో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి, కేక్ కట్ చేసి కేటీఆర్ కి జన్మదిన శుభాకాంక్షలు




తెలియజేశారు.ఈ సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్లు మసీవుల్లా, బాల్ రాజ్ యాదవ్, మంత్రి శ్రీదేవి, బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్, కిషోర్ గౌడ్, పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యులు సుమిత్ర తనోబా, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సభ్యులు రాఘవ, సతీష్, బోజా నారాయణ, సెయింట్ ఫిలోమెనాస్ స్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ ఉదయ్ భాస్కర్, ఫాదర్ క్రాంతి కుమార్, బిషప్ నెహెమియా, కెప్టెన్ సునీల్, కార్పొరేటర్ కూర్మ హేమలత, డివిజన్ ప్రెసిడెంట్ వెంకటేష్ రాజ్, మైనార్టీ సెల్ నాయకులు జై రాజ్, క్యాథలిక్ చర్చి అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ లియో లూయిస్, క్రిస్టియన్ జెఏసీ చైర్మన్ స్మాలన్ రాజ్, మైనార్టీ నాయకులు రాజేందర్, మోజెస్, ప్రణయ్, శేఖర్, ప్రశాంత్, బద్రుద్దీన్, బన్నీలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## నకిలీ ఓటర్లను ఎలా అనుమతిస్తాం.. విమర్శలపై ఈసీ క్లారిటీ




ఢిల్లీ : బీహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై విపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తున్న వేళ ఎట్టకేలకు కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. ఓటర్ల జాబితా విషయంలో ప్రతిపక్షాల విమర్శలపై క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేసింది. బీహార్‌లో నకిలీ ఓటర్లను ఎలా అనుమతిస్తామంటూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ఈసీ సమర్థించుకుంది. ఈమేరకు కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్‌కుమార్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ క్రమంలో ప్రతిపక్షాలను ఆరోపణలను తోసిపుచ్చారు.ఈ సందర్భంగా జ్ఞానేశ్‌కుమార్..'భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి తల్లి వంటిది. బీహార్‌లో నకిలీ ఓట్లను తొలగించడానికి మేము ప్రయత్నిస్తున్నాం. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రతిపక్షాలు తీవ్రంగా అభ్యంతరాలు చేయడంతో అర్థం లేదు. నకిలీ ఓటర్లకు ఎన్నికల సంఘం ఎందుకు అవకాశం ఇస్తుంది?. ఎస్ఐఆర్ నిష్పాక్షికంగా, నిబంధనల ప్రకారమే జరిగింది. ఓటర్ల జాబితాలో నకిలీ పేర్లు చేర్చడమన్నది పూర్తిగా నిరాధారమైంది. చనిపోయిన ఓటర్ల పేర్లు కూడా జాబితాలో ఉన్నాయి. రెండు చోట్ల ఓటు హక్కు ఉన్న వారు.. నకిలీ ఓటర్లు లేదా విదేశీ ఓటర్లను మాత్రమే జాబితా నుంచి తొలగించడం జరుగుతుంది అని చెప్పుకొచ్చారు. ఈ ప్రక్రియ మొదట బీహార్‌లో రానున్న రోజుల్లో మొత్తం దేశంలో జరుగుతుంది అని వెల్లడించారు.

లక్ష మంది ఓటర్లు 'దొరకట్లేదు'..

ఇదిలా ఉండగా.. బీహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియ కొనసాగిస్తోంది. బీహార్‌లో 7.17 కోట్లకుపైగా ఓటర్లు ఉన్నారు. అనర్హులైన ఓటర్లు బయటపడుతున్నట్లు తెలిసింది. సుమారు లక్ష మంది ఓటర్ల జాడ తెలియట్లేదని ఎన్నికల సంఘం బుధవారం వెల్లడించింది. ఓటర్ల జాబితాలో వారి పేర్లు ఉన్నప్పటికీ భౌతికంగా ఎక్కడున్నారో కనిపెట్టలేకపోతున్నామని స్పష్టంచేసింది. 20 లక్షల మంది ఓటర్లు మరణించినట్లు ఈ ప్రత్యేక సవరణలో తేలిందని పేర్కొంది. అలాగే మరో 28 లక్షల మంది చిరునామాలు శాశ్వతంగా మారాయని తెలిపింది. ఎస్ఐఆర్ ప్రక్రియ తొలి దశ ఆగస్టు ఒకటో తేదీ నాటికి పూర్తికానుంది. తర్వాత ముసాయిదా ఎన్నికల జాబితాను ప్రచురిస్తారు. ఇందులో లోపాలు ఉన్నట్లు ఎవరైనా గుర్తిస్తే అభ్యంతరాలు వ్యక్తం చేయొచ్చు. ఓటర్ల జాబితాలో అర్హుల పేర్లు లేకపోతే సెప్టెంబర్ ఒకటో తేదీ దాకా ఫిర్యాదులు సమర్పించవచ్చు.

## రాజా సింగ్ మిస్డ్ కాల్ ఇస్తే చాలా...బీజేపీలో ఇంతేనా ?

హైదరాబాద్,ఏంటో తేడా పార్టీ అని బీజేపీ గురించి ఆ పార్టీ నేతలు గొప్పలు చెప్పుకునేవారు. తేడా అంటే అన్ని పార్టీల కంటే విభిన్నం అని. బీజేపీ అత్యంత క్రమశిక్షణ కలిగిన పార్టీ అని కూడా చెప్పుకునేవారు. బీజేపీ అంటే అవినీతికి ఆశ్రియ పక్షపాతానికి వారసత్వానికి కుటుంబ పాలనకు దూరం అని కూడా ప్రవచించేవారు. అంతే కాదు ఇతర పార్టీల నుంచి నాయకుల కంటే సంఘ్ లో శిక్షణ పొందిన వారినే తీసుకోవడం ద్వారా తమ భావజాలాన్ని ఎక్కువగా ప్రచారం చేయవచ్చునని కూడా ఆశించేవారు.కానీ బీజేపీ తీరు గతానికి పోలిస్తే చాలా మారిపోయింది అని అంటారు. ఇతర పార్టీలో ఉన్నపుడు అవినీతి కేసులు ఎదుర్కొనేవారు బీజేపీలోకి చేరితే చాలు ఆ ఊసే ఉండదని విమర్శలు ఉన్నాయి. వారు సేఫ్ జోన్ లోకి వెళ్ళినట్లే అని చెబుతారు. అలాగే తమకు రాజకీయ అవసరం ఉన్న ప్రాంతీయ పార్టీలు కానీ ఇతర పార్టీ నేతలు కానీ వారి విషయంలో అవినీతి ఆరోపణలు ఉన్నా కేసులు ఉన్నా నెమ్మదిస్తాయని కూడా ప్రచారంలో ఉన్న మాటే.ఇక బీజేపీని ఎవరైనా ధిక్కరిస్తే చాలు వారికి జీవిత కాలం బహిష్కరణే. ఎప్పటికీ చేర్చుకునేవారు కాదు. తెలంగాణాలో బీజేపీ సీనియర్ నేతగా ఉన్న ఆలె నరేంద్ర పార్టీని వీడిపోయాక మళ్ళీ చేర్చుకోలేదు. ఆయన తెలంగాణా బీజేపీకి టైగర్ అని పేరు. అలాంటి నాయకుడు తరువాత కాలంలో టీఆర్ఎస్ లో చేరారు. రెండు సార్లు ఎంపీగా కూడా అయి కేంద్ర మంత్రి కూడా అయ్యారు.ఇక అవినీతి ఆరోపణలు వస్తే వారిని పార్టీ నుంచి ఏకంగా బయటకు పంపించేసేవారు. వారు ఎంతటి బలమైన నేతలు అయినా ఇదే విధానం. ఇపుడు చూస్తే ఇతర పార్టీల మాదిరిగా బీజేపీలనూ బాహాటంగా మాటల యుద్ధాలు జరుగుతున్నాయి. ఒకరిని ఒకరు నిందించుకుంటున్నారు. అయినా బీజేపీ నేతలు అన్ని పార్టీలలో ఉన్నాయి కదా మా పార్టీలో అలగే ఉంటుందని సర్దిచెబుతున్నారు.ఇక రాజా సింగ్ అనే ఘోషామహల్ ఎమ్మెల్యే బీజేపీని విమర్శిస్తూ గత నెలలో రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను పార్టీ ఆమోదించింది. అయితే ఆయన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయలేదు. పార్టీ చెబితే చేస్తాను అంటున్నారు తాను మోదీ అమిత్ షాలకు విధేయుడిని అని చెబుతున్నారు.ఇక నిజామాబాద్ బీజేపీ ఎంపీ అయిన ధర్మపురి అరవింద్ అయితే ఆయన పార్టీ నుంచి సస్పెండ్ కాలేదు కదా రాజీనామా మాత్రమే చేశారు మిస్డ్ కాల్ ఇస్తే తిరిగి పార్టీలోకి వస్తారు అని సింపుల్ గా చెప్పేశారు. బీజేపీలో అలాంటి వెసులుబాటు ఉందా అన్నదే చర్చగా ఉంది. బీజేపీని పలు మార్లు ఎన్నో రకాలుగా రాజా సింగ్ ఇబ్బంది పెట్టారని ఆ పార్టీ వారే చెబుతూ వచ్చారు.అందుకే ఆయనను పార్టీ నుంచి బయటకు పంపించాలని కూడా నిర్ణయం తీసుకుని పార్టీ పెద్దలకు లేఖ రాశారని ప్రచారం సాగింది.

## సైబరాబాద్‌లో భారీ వాహనాల ఎంట్రీపై ఆంక్షలు

హైదరాబాద్ : భారీ వాహనాల రాకపోకలపై సైబరాబాద్ పోలీసులు ఆంక్షలు విధించారు. రద్దీ సమయాల్లో రోడ్లపైకి భారీ వాహనాలు రావడం వల్ల తరచూ ట్రాఫిక్ జామ్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ఇటీవల ప్రధాన రోడ్లపై భారీ వాహనాలు బ్రేక్‌డౌన్ కావడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. బుధవారం దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జిపై డీసీఎం ఆగిపోవడంతో ఆ మార్గంలో ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు వాహనాన్ని అక్కడి నుంచి తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

డీసీఎం, రెడీమిక్స్ వాహనాలు..

డీసీఎం, రెడీమిక్స్ వాహనాలను ఉదయం 11.30 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య అనుమతిస్తామని, తిరిగి రాత్రి 10.30 నుంచి ఉదయం 7.30 గంటల మధ్య రాకపోకలకు అనుమతి ఉంటుందని పోలీసులు తెలిపారు.



ముందస్తు అనుమతి ఉండే రెడీమిక్స్ కాంక్రీట్ వాహనాలు, సీ అండ్ డీ వాహనాలను అన్ని మార్గాల్లో అనుమతిస్తామన్నారు.

## సంపాదకీయం

శుక్రవారం 25-07-2025

# నేతల ఆర్థిక అవినీతికి చెక్ పెట్టేదెలా?

తెలుగు రాష్ట్రాల్లో అప్పులు చేసిన నేతలను తిడుతూ పోతున్న ప్రస్తుత సిఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు లు కూడా అప్పులనే ఆశ్రయిస్తున్నారు. అప్పులతోనే పాలన సాగిస్తున్నారు. ఆర్థిక నియంత్రణ లేకుండా పోతోంది. దుబారా ఖర్చులు విపరీతంగా ఉన్నాయి. వారి రక్షణకు విపరీతంగా ఖర్చు చేస్తున్నారు. దీనికి తోడు జీత భత్యాలు కూడా విపరీతమే. ఎమ్మెల్యేలు, మంత్రులు ఇతరలు జీతభత్యాలు కూడా లెక్కకు మిక్కిలి ఖర్చు చేస్తున్నారు. వీటిని తగ్గించే ప్రయత్నాలు లేవు. ఇక ఓట్ల కోసం ఉచిత పథకాలను కొనసాగిస్తున్నారు. ఇవన్నీ ఆలోచిన చేసి, ఖర్చులు తగ్గించుకోవాలన్న ప్రయత్నం జరగడం లేదు. ఇద్దరు సిఎంల ధోరణి ఇలాగే ఉంది. గతంలో పనిచేసిన కెసిఆర్, జగనలు కూడా ఇంతకు మించి అన్నట్లు ప్రజాధనాన్ని దుబారా చేశారు. వేలకోట్లు వెనకేసుకున్నారు. నష్టపోతే పోయేది ప్రజలే అన్న ధోరణిలో పాలన సాగించారు. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు విపక్షంలో ఉన్న బిఆర్ఎస్, వైకాపాల తీరు ఒక్కటిగానే ఉంది. ప్రభుత్వంలో ఉండగా అలాగే ఉండేది. ఇద్దరి మనస్తత్వాలు ఒక్కటే అన్నది మెల్లగా ఇప్పుడు జనాలకు అర్థం అవుతోంది. అధికారంలో ఉండగా అడ్డూ అదుపు లేకుండా వ్యవహరించారు. నియంతృత్వ పోకడలతో ప్రజాధనాన్ని మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు పెట్టారు. నియంతల్లా పాలించారు. చరిత్రలో నియంతలను చూడకున్నా.. ఎలా ఉంటారో ఈ ఇద్దరినీ చూసిన వారికి అర్థం అయివుంటుంది. తెలంగాణ సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని నయా నియంతలా వ్యవహరించిన కెసిఆర్ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేసి, వ్యవస్థలను భ్రష్టు పట్టించి.. ఇప్పుడు ఎదురవుతున్న విమర్శలతో తప్పులను కప్పి పుచ్చుకునేందుకు తంటాలు పడుతున్నారు. అందుకే అధికార రుచి మరిగిన ఈ ఇద్దరూ ..మరోమారు అధికారంలో ఉండేలా పథకాల రచన చేసి రాష్ట్రాలను దోచేశారు. ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేసి రాష్ట్రాలను దివాళా తీయించారు. పథకాల పేరుతో నగదును దోచి పెట్టారు. చేతికి ఎముక లేదన్నట్లుగా పథకాలు రూపకల్పనతో నగదు బదిలీలు చేశారు. అభివృద్ది పేరుతో అప్పులు చేసి సంపద సృష్టించామని గొప్పలు చెప్పారు. ప్యాలెస్ కట్టుకున్నారు. సిఎం క్యాంప్ కార్యాలయం, సచివాలయం పేరుతో కెసిఆర్ దుబారాకు తెరలేపారు. కాళేశ్వరంతో రాష్ట్రాన్ని దివాళా తీయించారు. ఇక జగన్ విశాఖలో రాజప్రాసాదాలు నిర్మించు కున్నారు. ఎల్లప్పుడూ తమదే అధికారం అని విర్రవీగారు. పేదవాడికి ఓ చిన్న ఇల్లుకు నానా తంటాలు పడ్డా, తమకు మాత్రం రాజప్రసాదాలు కావాలని భావించారు. ఇంతగా డబ్బును వినియోగించి, ప్రజల చెమటను విలాసాలకు ఉపయోగించేశారు. కరిమింగిన వెలగపండులా ఇప్పుడు పరిస్థితి అంతా డొల్లగా మారింది. ఇద్దరూ అధికారం కోల్పోయాక కానీ అసలు విషయం ప్రజలకు కూడా తెలియలేదు. ఎంతగా అంటే రాష్ట్రం కోలుకోలని విధంగా అప్పులు చేశారు. ఈ అప్పులను తీర్చడమెలా అన్నది పక్కన పెట్టిన రేవంత్, చంద్రబాబులు ఉచిత పథకాలను కొనసాగిస్తూనే ఉన్నారు. వ్యక్తిగత దుబారాను తగ్గించు కోవడం లేదు. హెలికాప్టర్లు, ప్రత్యేక విమానాల్లో ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ఇక అప్పులు చేసి రాష్ట్రాలను దివాళా తీసిన బిఆర్ఎస్, వైకాపా నేతలు..మొగుడిని కొట్టి మొగసాలకు ఎక్కిందన్న సామెతలా..చేసిన తప్పులన్నీ చేసి, ఇప్పుడేమో నానాయాగీ చేస్తున్నారు. ఏపిలో అక్రమాలు, అపిాంస రాజ్యమేలు తున్నాయని జగన్ గగ్గోలు పెడుతున్నారు. పోలీస్ అధికారులపై జులుం ప్రదర్శించడం కూడా జరిగి పోయాయి. పరామర్శల పేరుతో నానా హంగామా సృష్టించారు. తనకు విపక్ష హోదా ఇవ్వడానికి భయపడుతున్నారని కూడా విమర్శలు చేస్తున్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా హుందాతనం ప్రదర్శించడంలో కెసిఆర్ ఆయన పరివారం, ఇటు జగన్ ఆయన పరివారం విఫలం అయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అధికార మార్పిడి జరిగిన తర్వాత అప్పట్లో పరిస్థితులు ఎలా ఉండేవో ఇప్పుడు ఎలా ఉన్నాయో ప్రజలకు అర్థం అవుతోంది. ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు ఇంతగా ఎందుకు దిగజారిపోయారా అని ఆనామానం కలుగుతోంది. ఏపిలో జగన్ అధికారంలో ఉండగా ఒక రకమైన భయానక వాతావరణం ఉండేది. బయటకు విమర్శలు చేస్తే....యూ ట్యూబర్లపైనా కేసులు పెట్టి వేధించిన ఘటనలు చూశాం. ప్రజలంతా భయం గుప్పిట్లో బతికారు. జగన్‌తో పాటు ఆయన కోటరీలో ఉన్న వారి వల్ల అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూసింది. తెలంగాణలో కూడా అధికార వ్యవస్థ భ్రష్టుపట్టి పోయింది. ఫోన్ ట్యాపింగ్‌తో ప్రత్యర్థుల ఫోన్లను ట్యాప్ చేశారు. అధికార దుర్వినియోగం విపరీతంగా సాగింది. ప్రగతి భవన్ పేరిట ప్యాలెస్‌ను పోలిన భవనాన్ని నిర్మింపజేసి అందులో నుంచి కాలు బయటపెట్టకుండా కనుసైగలతో రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు. అయినా ఆయనతో పాటు కొడుకు, అల్లుడి తీరులో మార్పు కనిపించడం లేదు. పాశ్చాత్తాపం కానరావడం లేదు. బటన్లను నొక్కడం వల్ల మళ్లీ అధికారంలోకి వస్తామని జగన్ నమ్మి అడ్డగోలు పనులు చేశారు. అందుకే జగన్‌ను జనం కసిగా దించినా.. కారణాలు తెలుసుకోలేక పోతున్నారు. ఆత్మవిమర్శలు చేసుకోవడం లేదు. రోడ్డెక్కి నానా హంగామా చేయాలని చూస్తున్నారు. అందుకే ప్రజలతో పాటు, అణచివేతకు గురైన నేతలు తమకు ఎదురైన అనుభవాలను గుర్తుచేసుకుంటూ పగ తీర్చుకోవాలని రగిలిపోతున్నారు. సొంత చెల్లెలు వైఎస్ షర్మిల, డాక్టర్ సునీతలు చేస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పడం లేదు. చేసిన తప్పులను పక్కన పెట్టిన బిఆర్ఎస్ నేతలు కెటిఆర్, హరీష్ రావు, కవితలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తూర్పార పట్టే పనిలో పడ్డారు. గత ఐదేళ్ల పాలనా అనుభవాలను దృష్టిలో పెట్టుకొని కెసిఆర్, జగన్‌లు తమ విధానాలు మార్చుకోవాలి. పాశ్చాత్తాపం ప్రకటించాలి. పాలకుల అవినీతిపై ఖచ్చితంగా విచారణ జరగాలి. శిక్షలు పడాలి. అందుకు ఇప్పుడున్న వ్యవస్థలో సాధ్యం కాదు. లోక్‌పాల్ వంటి వ్యవస్థను ఏర్పాటు చేస్తేనే పాలకుల అవినీతిని అరికట్టగలం. అక్కడే సమగ్ర విచారణ జరగగలదు. ఈ విషయంలో ప్రజాలు లోక్‌పాల్ కోసం ఉద్యమించాలి. రాజకీయ అవినీతిపై ప్రజలే యుద్ధం చేయాలి.

# తెలంగాణ కాంగ్రెస్‌లో పదేళ్ల లొల్లి!



హైదరాబాద్,తెలంగాణకు పదేళ్లు తానే ముఖ్యమంత్రినంటూ ఎనుముల రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన సహజంగానే కాంగ్రెస్ పార్టీలో కలకలం రేపింది. చర్చోపచర్చలకు దారితీసింది. అది కాంగ్రెస్ పార్టీ విధానం కాదని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి బహిరంగంగానే వ్యాఖ్యానించారు. అంతేకాకుండా.. కాంగ్రెస్‌ను వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చుకునే ప్రయత్నాలను నిఖార్సైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సహించరని కూడా అన్నారు. ఇది కాస్తా తెలంగాణ అధికార పార్టీ రాజకీయాలలో కొత్త వివాదానికి తెరదీసింది. నాగర్ కర్నూల్ జిల్లాలో జరిగిన ఒక కార్యక్రమంలో రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ '2034 వరకు అంటే.. పదేళ్లపాటు పాలమూరు బిడ్డ సీఎంగా ఉంటాడు. కేసీఆర్.. ఈ విషయాన్ని డైరీలోనో.. నీ గుండెలపైనో రాసుకో" అని సవాల్ విసిరారు. పాలమూరు నుంచే ప్రజా ప్రభుత్వాన్ని నడుపుతానని, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసే బాధ్యత తీసుకుంటానని భరోసా ఇచ్చారు. రెండున్నరేళ్లలో లక్ష ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. ప్రజలకు, ఒక ప్రాంతానికి ఇచ్చిన హామీలను నెరవేర్చుతానని చెప్పడం వరకు ఓకే. వచ్చే తొమ్మిదేళ్లు కూడా తానే సీఎం అని చెప్పడం తనపై తనకు ఉన్న నమ్మకం కావచ్చు. కానీ కాంగ్రెస్‌లో అలా బహిరంగంగా చెప్పడానికి పార్టీ అధిష్టానం కాని, ఇతర నేతలు కాని ఇష్టపడరు. రాజగోపాలరెడ్డి అభిప్రాయం కూడా అదే. కాంగ్రెస్ పార్టీలో అధిష్టానం నిర్ణయం ప్రకారం ప్రజాస్వామ్యయుతంగా సీఎంను నిర్ణయిస్తారని ఆయన అన్నారు. కాంగ్రెస్‌లో ఈ విధానం ఉన్న మాట నిజమే కాని, కేంద్రంలో అధికారం లేక ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో అధిష్టానం పెద్దలు కూడా సీఎంల మార్పుపై సంచలన నిర్ణయాలు చేసే పరిస్థితి పెద్దగా కనబడదు. కర్ణాటక వ్యవహారమే దీనికి ఉదాహరణ. అక్కడ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను మార్చాలని, తనను సీఎంను చేయాలని ఉప ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్ డి.కె.శివకుమార్ కోరుకుంటున్నారు. అయినా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లిఖార్జున్ ఖర్గేలు ఇందుకు సాహసించడం లేదు. పైగా ఈ ఐదేళ్లు సిద్ధరామయ్య కొనసాగవచ్చన్న సంకేతాలు వస్తున్నాయి. దానికి అక్కడ ఉండే రాజకీయ, సామాజిక అంశాలు కారణాలు కావచ్చు. అయితే.. సిద్ధరామయ్య కూడా వచ్చే ఎన్నికల తర్వాత కూడా తానే సీఎం అని చెప్పుకోవడం లేదు. కానీ రేవంత్ ధైర్యంగా 2028 ఎన్నికలలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, తిరిగి తానే సీఎం అవుతానని చెబుతున్నారు. తన వర్గంలో విశ్వాసం పెంచడానికి ఇది ఉపయోగపడవచ్చు కానీ, పార్టీలోని ఇతర వర్గాలలో ఇది అసహనానికి కారణం అవుతుంది. కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పదవి ఆశిస్తున్న అభ్యర్థులు ఎక్కువే. 2014లో అయితే డజను మంది తామే అభ్యర్థులమంటూ ప్రచారం చేసుకున్నారు. అందుకే కాంగ్రెస్‌లో టీఆర్ఎస్(బీఆర్ఎస్) విలీనం కాకుండా అడ్డుపడ్డారు. కేసీఆర్ తనకు సీఎం పదవి ఇస్తే విలీనం చేస్తానని కండిషన్ పెట్టారు. చివరికి ఒంటరిగా పోటీచేసి విజయం సాధించడంతో కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు. పదేళ్లు ఆ పరిస్థితి కొనసాగడంతో కాంగ్రెస్ నేతలు నిరాశలో మునిగిపోయారు. 2018 ఎన్నికలకు కొద్దికాలం ముందు రేవంత్ రెడ్డి తెలుగుదేశం పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. తదుపరి వర్కింగ్ అధ్యక్షుడుగా, అనంతరం పీసీసీ అధ్యక్షుడుగా నియమితులయ్యారు. ఎమ్మెల్యే ఎన్నికలలో ఓటమి పాలైనా, మల్కాజిగిరి ఎంపీగా గెలవడం ఆయనకు కలిసి వచ్చింది. ఢిల్లీ స్థాయిలో పార్టీ నాయకత్వంతో సంబంధాలు పెట్టుకోగలిగారు. పార్టీ సీనియర్ నేతలు ఉత్తంకుమార్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకటరెడ్డి, తదితరులు తొలుత రేవంత్ నాయకత్వానికి సుముఖత చూపలేదు. తప్పని స్థితిలో ఒప్పుకున్నారు. రేవంత్ నియామకంపై కోమటి రెడ్డి వెంకట రెడ్డి వంటివారు గట్టి విమర్శలే చేసేవారు. ఆయన సోదరుడు రాజగోపాల రెడ్డితో కలిసి తమకు పీసీసీ బాధ్యతలు అప్పగిస్తే అధికారం సాధిస్తామని చెప్పినా అధిష్టానం వారివైపు మొగ్గు చూపలేదు. ఒక దశలో కాంగ్రెస్ నాయకత్వం అప్పటి సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని ఎదుర్కోవడానికి సరైన చర్య తీసుకోవడం లేదంటూ రాజగోపాల రెడ్డి పార్టీని వీడి బీజేపీలో చేరారు. ఇందుకోసం ఆయన తన ఎమ్మెల్యే పదవి కూడా వదలుకున్నారు. తదుపరి ఉప ఎన్నికలో ఆయన ఓటమి చెందారు. ఆ తర్వాత మళ్లీ 2023 జనరల్ ఎన్నికలు వచ్చేసరికి తిరిగి కాంగ్రెస్‌లో చేరిపోయి మునుగోడు నుంచే పోటీచసి విజయం సాధించారు. ఈయన సోదరుడు, సీనియర్ నేత వెంకట రెడ్డి నల్గొండ నుంచి గెలిచి మంత్రి అయ్యారు. రాజగోపాలరెడ్డి కూడా మంత్రి పదవిని ఆశించి భంగపడ్డారు. అధిష్టానం కూడా ఆయనను బుజ్జగించే యత్నం చేసింది. రేవంత్ పీసీసీ అధ్యక్షుడిగా ఉండి పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చారన్న భావనతో ఆయనకే సీఎం పదవి అప్పగించింది. మల్లు భట్టి సీఎం రేసులో నిలిచినా ఉప ముఖ్యమంత్రి పదవితో సర్దుకోక తప్పలేదు. అలాగే ఉత్తంకుమార్ రెడ్డి, వెంకట రెడ్డి తదితర ఆశావహులు కూడా రాజీపడి రేవంత్ కేబినెట్లో మంత్రులుగా చేరిపోయారు. అయినా వీరిలో కొందరు రేవంత్ పై ఎప్పటికప్పుడు అధిష్టానానికి ఫిర్యాదులు చేస్తున్నారట. రేవంత్ ప్రభుత్వం చేసే తప్పులను, వచ్చే ఆరోపణలను తెలియ చేస్తున్నారట. రేవంత్ కూడా అంతకన్నా తెలివిగా అధిష్టానంతో సంబంధాలు కొనసాగిస్తున్నందున ఇప్పటికైతే ఆయనను కదలించే శక్తి ఇతర కాంగ్రెస్ నేతలకు ఉన్నట్లు కనిపించదు. కాంగ్రెస్ రాజకీయాలలో ఎప్పుడు ఏదైనా జరగవచ్చు. అది వేరే సంగతి. కాంగ్రెస్ రాజకీయాలు చూస్తే ఉమ్మడి ఏపీలో పూర్తి టర్మ్ పదవి కాలంలో ఉన్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మాత్రమే కావడం విశేషం. 2004లో ఆయన నాయకత్వంలో పార్టీ అధికారంలోకి వచ్చాక కూడా కొందరు ఇతర నేతలు సీఎం పదవి కోసం పోటీ పడకపోలేదు. కానీ అధిష్టానం వైఎస్ నాయకత్వానికి అంగీకరించక తప్పలేదు. అలాగే 2009లో రెండోసారి గెలిచిన పిమ్మట అప్పటి పీసీసీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ కూడా తనకు సీఎం పదవి కావాలని ప్రకటన చేశారు. అయినా వైఎస్సార్‌కే సీఎం సీటు తిరిగి దక్కింది. 1956 లో ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి అయిన నీలం సంజీవరెడ్డి దాదాపు మూడేళ్ల తర్వాత కేంద్ర రాజకీయాలకు వెళ్లారు. దామోదరం సంజీవయ్య ముఖ్యమంత్రి అయ్యారు. 1962లో నీలం సంజీవరెడ్డి మళ్లీ సీఎం అయ్యారు కాని పూర్తి టర్మ్ ఉండలేదు. 1964లో ముఖ్యమంత్రైన కాసు బ్రహ్మానందరెడ్డి 1967 ఎన్నికల తర్వాత తిరిగి ఆ పదవి చేపట్టినా, పూర్తి కాలం కొనసాగలేకపోయారు. తరువాత పీవీ నరసింహారావు ముఖ్యమంత్రి అయ్యారు. జై ఆంధ్ర ఉద్యమం కారణంగా ఆయన 1972లో పదవి వదలుకోవల్సి వచ్చింది. కొంతకాలం రాష్ట్రపతి పాలన తర్వాత సీఎం అయిన జలగం వెంగళరావు 1978 వరకు కొనసాగారు. ఆ తరుణంలో పార్టీలో వచ్చిన చీలికలో 1978లో మర్రి చెన్నారెడ్డి ఇందిరా కాంగ్రెస్ పక్షాన సీఎం అయ్యారు. 1978-83 మధ్య చెన్నారెడ్డి, అంజయ్య, భవనం వెంకటరామి రెడ్డి, కోట్ల విజయ భాస్కరరెడ్డిలు సీఎం పదవులు నిర్వహించారు. 1983లో ఎన్టీఆర్ స్థాపించినన టీడీపీ అధికారంలోకి వచ్చింది. తిరిగి 1989లో కాంగ్రెస్ గెలుపొందడంతో 1989-94 మధ్య చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్ధన రెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి ముఖ్యమంత్రులయ్యారు. 1994 లో ఓటమి పాలైన కాంగ్రెస్ మళ్లీ 2004లో అధికారంలోకి వచ్చాక వై ఎస్ సీఎం అయ్యారు. 2009లో తిరిగి ఆయన ముఖ్యమంత్రయ్యాక అనూహ్యంగా హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. ఆ తర్వాత రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డిలు ముఖ్యమంత్రులు అయ్యారు. అంటే వైఎస్సార్ తప్ప ఏ ఒక్క కాంగ్రెస్ సీఎం కూడా పూర్తి టర్మ్ పాలించలేదన్నమాట. 2014లో రాష్ట్ర విభజన జరగడంతో కాంగ్రెస్ పార్టీ ఏపీలో పూర్తిగా దెబ్బతినిపోగా, తెలంగాణలో పదేళ్లపాటు అధికాంలోకి రాలేదు. 2023లో రేవంత్ సీఎం అయిన తర్వాత కొంత స్వతంత్రంగా ప్రభుత్వాన్ని, పార్టీని నడపడానికి యత్నిస్తున్నారు. తెలుగుదేశం నుంచి వచ్చిన వ్యక్తి అవడంతో మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్న వ్యక్తులు రేవంత్‌ను ఏపీ సీఎం చంద్రబాబు శిష్యుడుగానే చూస్తుంటారు. ఆయన కూడా అప్పుడప్పుడు చంద్రబాబును ప్రశంసించినట్లు మాట్లాడుతుంటారు. నాగర్ కర్నూల్ సభలోనూ చంద్రబాబు ప్రస్తావన తెచ్చి మహబూబ్ నగర్ జిల్లాలో వివిధ ప్రాజెక్టులు చేపట్టినట్లు మాట్లాడారు. వైఎస్ రాజశేఖరరెడ్డి చొరవకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపించలేదు. అప్పుడప్పుడూ వైఎస్ పేరును ప్రస్తావిస్తున్నా, కాంగ్రెస్ వర్గాలకు అంత సంతృప్తి కలిగించే రీతిలో మాట్లాడడం లేదన్న భావన ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకునే కోమటి రెడ్డి రాజగోపాల రెడ్డి తన వ్యాఖ్యలో నిఖార్సైన కాంగ్రెస్ నేతలు సీఎం చేసిన వ్యాఖ్యలను అంగీకరించరని అన్నారు. సాధారణంగా.. జాతీయ పార్టీలలో హై కమాండ్ దే తుది నిర్ణయం అనే సంగతి తెలిసిందే. అయితే ఇది పరిస్థితులను బట్టి, రాజకీయ పరిణామాలను బట్టి, ఆయా వ్యక్తుల బలాబలాలను బట్టి ఉంటుంది. ఢిల్లీ స్థాయిలో కాంగ్రెస్ బలంపై కూడా ఆధారపడి ఉంటుంది. రేవంత్ కూడా కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో తనకు ఎక్కువ మద్దతు ఉండేలా చూసుకుంటున్నారు. అందువల్ల అధిష్టానం కూడా తొందరపడే పరిస్థితి ఉండదు. ఆ ధైర్యంతోనే రేవంత్ భవిష్యత్తులో కూడా తానే సీఎం అని చెప్పుకుని ఉండవచ్చు. రేవంత్ పై అసహనం వ్యక్తం చేయడం మినహా, అసమ్మతి ఉన్న కాంగ్రెస్ నేతలు ఇప్పటికిప్పుడు ఏమీ చేయలేకపోవచ్చు.

# అన్ని హాస్టళ్లకు క్వాలిటీ ఫైన్ రైస్...



హైదరాబాద్, రాష్ట్రంలోని అన్ని సంక్షేమ వసతి గృహాల్లో పౌర సరఫరాల శాఖతో సమన్వయం చేసి, నాణ్యమైన ,ఫైన్ రకం బియ్యం అందించేందుకు చర్యలు తీసుకుంటామని సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెల్లడించారు. వసతి గృహాల్లో ఇక నుండి అల్యూమినియం పాత్రలకు బదులుగా స్టీల్ పాత్రలలో వండాలనీ ఆయన ఆదేశించారు. ఇందుకు అయ్యే ఖర్చుల అంచనా నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు. సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా, రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలలో పని చేస్తున్న జోనల్ అధికారులు, ప్రిన్సిపల్స్‌తో ఒరియంటేషన్ కార్యక్రమం హైదరాబాద్ వేదికగా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ అవగాహన పెంపొందిం చేందుకు 'మిషన్ ప్రకృతి'పై కుదుర్చుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... గత ప్రభుత్వ పాలనలో ఉద్యోగుల సమస్యలకు పట్టించుకునే నాధుడు లేడని ఇప్పుడు పరిస్థితి మారిందన్నారు. ఉద్యోగుల సమస్యలను న్యాయపరంగా పరిష్కరించేందుకు పూర్తి స్థాయిలో ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ప్రిన్సిపాళ్లకు సర్వీస్ మ్యాటర్ కు సంబంధిత అంశాలను నియమావళి మేరకు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గతంలో విద్యార్థులు డార్మెటరీల్లోనే పాఠాలు విని, అక్కడే తిన్న ఘటనలు విన్నప్పుడు ఎంతో బాధ కలిగింది. ఇకపై హాస్టళ్లను స్వయంగా పర్యటిస్తానన్నారు. సమస్యలు నేరుగా తెలుసుకుంటానని మంత్రి తెలిపారు. విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అందుకోసం ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా గారికి ఇప్పటికే సూచనలు చేసినట్లు- చెప్పారు. ప్రతి హాస్టల్‌కు 15 రోజులకొకసారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి వైద్య బృందం వచ్చి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం అని పేర్కొన్నారు.తాను కూడా ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చి, ఈ గురుకులాల్లోనే చదువుకున్న విద్యార్థినే. బాధ్యతలు తెలిసినవాడినని మంత్రి చెప్పారు. విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యంగా అధ్యాపకులు పనిచేయాలని మంత్రి దిశా నిర్దేశం చేశారు. విద్యార్థుల హితాన్ని దృష్టిలో పెట్టుకొని, సబ్జెక్ట్ వారీగా వెనుకబడ్డ వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జోనల్ అధికారులకు, ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు ఇచ్చారు. డైనింగ్ హాల్స్, మెస్‌లో ఎలాంటి నిబంధనల ఉల్లంఘన జరగకుండా చూడాలని, వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. సంక్షేమ హాస్టళ్లకు అవసరమైన నిధుల కోసం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో మాట్లాడి వెంటనే మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. పరకాల డిగ్రీ కళాశాల తాత్కాలిక మరమ్మత్తులకు అవసరమైన నిధులను ఇన్‌చార్జి మంత్రితో మాట్లాడి ఆ కలెక్టర్‌తో సమన్వయం చేసుకొని వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని ఆయన అక్కడికక్కడే హామీ ఇచ్చారు.గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల డైట్ చార్జీలు, కాస్మెటిక్ ఛార్జీల పెంపుపై దృష్టి సారించలేదని తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మెస్ , కాస్మెటిక్ చార్జిలను పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే యూనిఫాం, షూస్, పుస్తకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సర్వీస్ మేటర్, 010 పద్దు వేతనాలు, హెల్త్ కార్డుల పరిష్కారానికి ప్రభుత ముఖ్య కార్యదర్శితో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పిల్లలకు అందించే మెస్ విషయంలో అందులో జరిగే చిన్నపాటి లోటుపాట్లపై ప్రతిపక్షాలు, సోషల్ మీడియాలో బురద జల్లినా, అధికారులు నిర్లక్ష్యం చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు

# ఐదు గ్రామాల్లో ప్రయోగాత్మక సర్వే

హైదరాబాద్,దశాబ్దాలుగా రాష్ట్రంలో నక్షా లేని 413 గ్రామాలకు గాను ఐదు గ్రామాలలో ప్రయోగాత్మకంగా చేపట్టిన రీసర్వేను విజయవంతంగా పూర్తిచేశామని వీలైనంత త్వరితగతిన ఆ ఐదు గ్రామాల్లో సర్వే బౌండరీస్ యాక్ట్ ప్రకారం నక్షా మ్యాప్ నకు తుదిరూపునిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. బుధవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో రీసర్వేపై ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ కార్యదర్శి వి. లోకేష్ కుమార్, సర్వే ల్యాండ్‌సెటిల్ మెంట్ కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిజాం కాలం నుంచి 413 గ్రామాలకు నక్షాలు లేవని గత ప్రభుత్వం పది సంవత్సరాలలో ఈ గ్రామాలను గాలికి వదిలేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం దీనికి పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో ప్రయోగాత్మకంగా మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్ నగర్, జగిత్యాల్ జిల్లా భీర్పూర్ మండలం కొమ్మనాపల్లి , ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ, ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురు, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం షాహిద్ నగర్ గ్రామాల్లో డ్రోన్ /ఏరియల్ మరియు ప్యూర్ గ్రౌండ్ ట్రూతింగ్ రోవర్ పద్ధతుల్లో సర్వే నిర్వహించామని తెలిపారు. నిబంధనల ప్రకారం భూ యజమానులకు నోటీసుల జారీ చేయడం, గ్రామ సభలు నిర్వహించి యజమానుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని ప్రతి ఒక్కరి భూములకు సర్వే హద్దులను ఖరారు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ ఐదు గ్రామాల్లో ఎదురైన అనుభవాలను దృష్టిలోపెట్టు-కొని మిగిలిన గ్రామాల్లో కూడా రీసర్వే నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు- చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల మనోభావాలు, ఆలోచనలకు అనుగుణంగా వారు సంతృప్తి చెందేవిధంగా నక్షా మ్యాప్ ఉండాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం ఏం చేసినా అంతిమంగా సామాన్య ప్రజలు, రైతుల సంతోషమే ప్రధానమన్నారు. భూములు అమ్మకం, కొనుగోలు సందర్భంలో హద్దులతో కూడిన సర్వే మ్యాప్ ను ఖచ్చితంగా జత పరచాలని అలాగే దేశంలో ప్రతి పౌరుడికి ఆధార్ నెంబర్ ఎలా ఉంటుందో భూములకు కూడా భూదార్ నెంబర్ కేటాయించాలని భూభారతి చట్టంలో స్పష్టం చేయడం జరిగిందని ఈ ఐదు గ్రామాలలో ఈ రెండు అంశాలను అమలు చేయాలన్న ఆలోచన చేస్తున్నామన్నారు. ఈ ఐదు గ్రామాలలో ఐదు గుంటలకు పైగా ఉన్నభూములకు కొత్తగా సర్వేనెంబర్లు ఇవ్వాలని, అలాగే రెవెన్యూ, ఫారెస్ట్, దేవాదాయ, వక్ఫ్ భూములు ఉంటే వాటి వివరాలను కూడా రికార్డులలో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, సర్వే ల్యాండ్ సెటిల్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ప్రసన్న లక్ష్మి, ఐదు గ్రామాలకు చెందిన ఆర్డీవోలు, తహశీల్దార్లు, సర్వే ల్యాండ్ సెటిల్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్లు, సర్వే నిర్వహించిన ఏజన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జివో 49పై వెనక్కి తగ్గిన ప్రభుత్వం

ఆదిలాబాద్,ఎక్కడో ఒకచోట పులి జాడలుకనిపిస్తేనే వణికిపోయిన గిరజనం ఇప్పుడు..కవ్వాల్ టైగర్ ఫారెస్ట్ జోన్ ప్రకటనతో చలించిపోయింది. తాము ఉన్న ఊళ్లు వదలాల్సి వస్తుందని ఆందోళన చెందారు. అందుకు జీవో 49కి వ్యతిరేకంగా ఉద్యమించారు. జిల్లా బంద్ చేపట్టారు.జీవో 49ని రద్దు చేయాలని ఆదివాసీ, తుడుందెబ్బ సంఘాల ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ జిల్లాలో సోమవారం నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఆసిఫాబాద్‌లో ఆదివాసీ, ఇతర సంఘాల నాయకులు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ధర్నా చేశారు. కాగజ్‌నగర్‌లో ర్యాలీ తీశారు. మిగతా మండలాల్లో ఆదివాసీ, తుడుందెబ్బ నాయకులు నిరసనలు చేపట్టారు. మంచిర్యాల జిల్లా దండేపల్లిలో ఆదివాసీ, గిరిజన సంఘాలు రాస్తారోకో చేపట్టాయి. అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నెన్నెలలో జీవో ప్రతులను దహనం చేశారు. కాసిపేట మండలంలో బంద్ నడిచింది. ఆదిలాబాద్‌లో ప్రధాన వీధుల గుండా ఆదివాసీ నేతలు ర్యాలీలు నిర్వహించి దుకాణాలను మూసి వేయించారు. బస్టాండ్, బస్ డిపో ఎదుట ఆందోళన చేపట్టారు. గుడిహత్నూర్, ఉట్నూర్ మండల కేంద్రాల్లో వాణిజ్య సంస్థలు మూతబడ్డాయి. ఈ క్రమంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. చివరకు జివోను రద్దు చేసేలా చేశారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఏర్పాటు చేయాలనుకున్న టైగర్ కన్జర్వేషన్ జోన్ విషయంలో సర్కారు వెనక్కి తగ్గింది. సుమారు 330 గ్రామాలను ప్రభావితం చేయనున్న ఈ పులుల సంరక్షణ కేంద్రంపై ఆదివాసీల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవడంతో ప్రభుత్వం పునరాలోచనలో పడింది. టైగర్ రిజర్వ్ ఏర్పాటు కోసం తీసుకువచ్చిన జీవో 49ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. జీవో 49 విషయంలో ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో కలెక్టర్ నుంచి సేకరించిన తాజా నివేదిక మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్, కెరమెరి, రెబ్బెన, తిర్యాణి, కాగజ్‌నగర్, సిర్పూర్, కర్జెల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ రేంజ్‌లో లక్షా 49 వేల హెక్టార్లను -టైగర్ రిజర్వ్‌లోకి మారుస్తూ గత నెల 30న ప్రభుత్వం జీవో 49ని ఇచ్చింది. దీనిని వ్యతిరేకిస్తూ స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. దీంతో 330 ప్రభావిత గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులపై అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆదిలాబాద్ ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సమగ్ర వివరాలను సేకరించారు. వాస్తవ పరిస్థితులను సీఎం రేవంత్‌రెడ్డికి వివరించారు. దీంతో జీవో 49ని తాత్కాలికంగా నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాగా, జీవో 49 నిలుపుదలపై హర్షం వ్యక్తం చేస్తూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిని సోమవారం కలిసి కృతజ్ఞతలు తెలపడంతో పాటు సన్మానించారు. సహకరించిన మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, కొండాసురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌కు.. ఎమ్మెల్సీ దండె విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎమ్మెల్యే అత్రం సక్కు కృతజ్ఞతలు తెలిపారు.

# పెట్టుబడులే లక్ష్యంగా కూటమి కృషి

అమరావతి,ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మన మిత్ర ద్వారా మెరుగైన సేవలను కూటమి ప్రభుత్వం అందిస్తోందని ఏపీ విద్య, ఐటీ- శాఖల మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. గతంలో ఎయిర్‌పోర్ట్ ఎలా ఒక ప్రాంతం రూపురేఖలు మార్చిందో చూశామని తెలిపారు. తెలంగాణ జీడీపీలో ఎయిర్‌పోర్ట్ వల్ల ఆదాయం 17శాతం నుంచి 18శాతానికి పెరిగిందని వివరించారు. ఏపీలో పెట్టుబడులు ప్రోత్సహించడమే లక్ష్యంగా పారిశ్రామిక వేత్తలతో బుధవారం విజయవాడలో సమ్మిట్ నిర్వహించారు. యూఏఈ పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ఈ సదస్సు జరిగింది. భారత్- యూఏఈ ఆర్థిక సంబంధాల బలోపేతంపై మంత్రి నారా లోకేష్ ఈ సదస్సులో ప్రసంగించారు. క్వాంటమ్ కంప్యూటింగ్ అమరావతిలో గేమ్ చేంజర్ అవుతుందని మంత్రి నారా లోకేష్ ఉద్ఘాటించారు. ఎవ్వరూ క్వాంటమ్ గురించి మాట్లాడనప్పుడు తాము క్వాంటమ్ యూజ్ కేసుల గురించి మాట్లాడుతున్నామని తెలిపారు. ఏఐ మంత్రిని కలిగి ఉన్నా మొదటి దేశం యూఏఈ అని వెల్లడించారు. ఏపీ ఇప్పుడు ఏఐని అడాప్ట్ చేసుకుని హ్యాకథాన్‌లు నిర్వహిస్తోందని వ్యాఖ్యానించారు. ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయని కొంతమందిలో ఆందోళన ఉందని.. అయితే పారిశ్రామిక విప్లవం మరిన్ని ఉద్యోగాలు తెచ్చిందని అన్నారు. అలా ఏఐ కూడా చాలా ఉద్యోగాలు తెస్తోందని.. ఏఐ మనకు వే ఆఫ్ లైఫ్ అని చెప్పారు. దీన్ని బేసిక్ డ్రాఫ్టింగ్‌కు వాడతానని చెప్పుకొచ్చారు లోకేశ్. ఈ సమావేశం సారాంశాన్ని సమ్మరైజ్ చేయడానికి ఏఐని ఉపయోగిస్తున్నానని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

# డీలర్ల ఖాళీల భర్తీకి డిమాండ్

కామారెడ్డి,పలుచోట్ల రేషన్ షాపులకు డీలర్లు లేక పోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు సన్నబియ్యం సరఫరాతో రేషన్ షాపులకు ప్రజలు వస్తున్నారు. ప్రస్తుతం బయోమెట్రిక్ సిస్టమ్ ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్నారు. డీలర్ కూడా బయోమెట్రిక్ పెట్టాలి. ఎవరి పేరిట షాపు ఉందో వారు బయోమెట్రిక్ చేస్తేనే ఆన్‌లైన్ ఓపెన్‌అవుతుంది. ఇన్‌చార్జి ఉన్న గ్రామాలతో పాటు, రెగ్యులర్‌గా ఉన్న గ్రామాల్లో ఒకే వ్యక్తి బయోమెట్రిక్ సిస్టమ్ ద్వారా బియ్యం పంపిణీకి ఆలస్యం అవుతోంది. ఇన్‌చార్జి ఉన్న షాపుల్లో 2, 3 రోజుల్లో బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఈ రోజుల్లో ఎవరైనా లబ్దిదారులు లేకపోతే రేషన్‌తీసుకునే విలులేదు. స్థానికంగా డీలర్ ఉంటే ఉదయం, సాయంత్రం లబ్దిదారులకు బియ్యం పంపిణీ చేస్తారు. ఇటీవల పలు గ్రామాల ప్రజలు స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే రంగంలోకి దిగి ఖాళీల భర్తీకి పూనుకున్నారు. గ్రామాల్లో ఏళ్ల తరబడి ఈ సమస్య ఉండగా..లబ్దిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇన్‌చార్జి డీలర్లతోనే నెట్టుకొస్తుండగా..వెంటనే భర్తీ చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం 489 మంది డీలర్లు ఉన్నారు. గతంలో నియమాకమయిన డీలర్ చనిపోవటం, కొందరు వివిధ కారణాలతో వదిలేయటం, అక్రమాలకు పాల్పడిన దృష్ట్యా కొందరిని గతంలో తొలగించటంతో ఖాళీలు ఏర్పడ్డాయి. స్థానికులు పలుమార్లు డీలర్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదు.

## శ్రీశైలానికి పెరిగిన వరద ఉధృతి

శ్రీశైలం,ఎగువ ప్రాంతాల నుంచి చేరుతున్న వరద నీటి కారణంగా శ్రీశైలం జలాశయానికి వరద ఉధృతి పెరుగుతోంది. జూరాల, సుంకేశుల ప్రాజెక్టుల నుంచి వరద వచ్చి డ్యామ్‌లో చేరుతున్నది. ప్రస్తుతం జలాశయానికి 91,812 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. ఇక అవుట్ ఫ్లో 1,14,709 క్యూసెక్కులుగా నమోదైంది. ఒక స్పిల్ వే గేట్ ఎత్తి 27,52 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 20 వేల క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. ఎడమ గట్టు-, కుడిగట్లలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది. ఎడమగట్టు- నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు- నుంచి 31,870 క్యూసెక్కులు వరద దిగువకు వెళుతున్నది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 883.80 అడుగుల మేర నీరుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థం 215.80 టీ-ఎంసీలు కాగా, ప్రస్తుతం 208.72 టీ-ఎంసీల మేర నిల్వ ఉందని అధికారులు తెలిపారు. అయితే, ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో తెలుగు రాష్ట్రాలతోపాటు- ఎగువ ప్రాంతాల్లో వానలు దంచికొడుతున్నాయి. వర్షాలు ఇలాగే కొనసాగితే కృష్ణా నదికి వరద ఇంకా పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## భర్తను కిరాతకంగా హత్య చేసిన భార్య

నంద్యాల, వైవాహిక జీవితాలు గాడి తప్పుతున్నాయి. క్షణాకావేశంలో కొందరు భార్యలు పక్కా ప్లాన్‌తో భర్తలని అతి కిరాతకంగా చంపేస్తున్నారు. ఆ తర్వాత దానిని హత్యగా, ప్రమాదాలుగా చిత్రీకరించే ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా ఇలాంటి ఘటన నంద్యాల జిల్లాలో వెలుగులోకి వచ్చింది. నంద్యాల జిల్లాలోని నూనెపల్లె రమనయ్య (50)తో, పల్నాడు జిల్లా పిడుగురాల్లకు చెందిన రవనమ్మకి వివాహం జరిగింది. పెళ్లి అయిన తర్వాత వీరి వివాహ బంధంలో తరచుగా మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. అయితే భర్త రమనయ్య ప్రవర్తనతో విసిగిపోయిన భార్య రవనమ్మ.. తన భర్తని అంతమొందించాలని ప్లాన్ చేసింది. ఈ క్రమంలోనే భర్తతో వచ్చిన గొడవలతో పుట్టింటికి వెళ్లింది.భార్యను తీసుకురావడానికి పిడుగురాల్లకు వెళ్లాడు రమనయ్య. అయితే ఈ నేపథ్యంలో మరోసారి ఘర్షణ పడ్డారు భార్యభర్తలు. ఈ గొడవలో తమ్ముడితో కలసి భర్త రమనయ్యను దాడి చేసి దారుణంగా చంపింది భార్య రవనమ్మ. డెడ్ బాడీని కారులో తీసుకొచ్చి నంద్యాల జిల్లాలోని నూనెపల్లెలో వాళ్ల ఇంటి దగ్గర పడేసి భార్య రవనమ్మ పరారైంది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. స్థానికుల సమాచారంతో పోలీసులు రమనయ్య ఇంటి వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై నంద్యాల జిల్లా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పల్నాడు జిల్లాలో దారుణం

బాపట్ల,ఉమ్మడి ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం పాత మాగులూరు శివారులో తండ్రీ కొడుకు దారుణ హత్యకు గురయ్యారు. పల్నాడు జిల్లా నరసరావుపేట కోర్టు వద్ద తండ్రి కొడుకులు వీరాస్వామి రెడ్డి, ప్రశాత్ రెడ్డిని బుధవారం కొందరు వ్యక్తులు కిడ్నాప్ చేసి.. కారులో తరలించారు. ఆ తరవాత వారిని శివారులో గొంతుకోసి హత్య చేశారు. ఈ ఘటనలో ప్రధాని నిందితుడు గడ్డం అనిల్ కుమార్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం అతడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అందులో భాగంగా నిందితుడు గడ్డం అనిల్ కుమార్ రెడ్డిని విచారిస్తున్నారు. అయితే ఆర్థిక లావాదేవీల్లో విబేధాల కారణంగానే వీరిద్దరిని ప్రత్యర్థులు హత్య చేశారని పోలీసులు వివరించారు. కిడ్నాప్ చేస్తుండగా ఈ విషయాన్ని అక్కడే ఉన్న స్థానికులు చూసి.. ఆ కారును బైక్‌పై వెంబడించారు. అంతేకాకుండా.. ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. ఇక ఈ తండ్రీ కొడుకులను సంతమాగులూరు మండలం పాత మాగులూరు వద్దనున్న రియల్ ఎస్టేట్ వెంచర్‌లోకి తీసుకు వెళ్లి.. వారి గొంతు కోసం హత్య చేశారు. ఇంతలో బైక్‌పై వచ్చిన స్థానికులతోపాటు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఆ క్రమంలో వారంతా కలిసి.. ఈ కేసులో ప్రధాన నిందితుడు అనిల్ కుమార్ రెడ్డిని పట్టుకున్నారు. మరోవైపు గొంతు కోయడంతో ఆ తండ్రీకొడుకులు ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. వారి మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న బాధిత కుటుంబికులు.. ఆసుపత్రికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. ఇక ఈ ఘటనలో నిందితులు ఉపయోగించిన స్కార్పియో కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ హత్య వెనుక ఎవరెవరూ ఉన్నారనే కోణంలో దర్యాప్తు జరుపుతున్నారు.

## విచారణ పేరుతో వేధిస్తున్నారు

హైదరాబాద్,ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు మరోసారి సుప్రీంకోర్టు తలుపు తట్టారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ పేరుతో సిట్ అధికారులు వేధిస్తున్నారని పిటిషన్ దాఖలు చేశారు. విచారణ పేరుతో తరుచూ పోలీస్ స్టేషన్‌కు పిలుస్తున్నారని వాపోయారు. ఆగస్టు 4వ తేదీన ప్రభాకర్ రావు పిటిషన్ విచారణకు రానున్నట్లు- సమాచారం. మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్ట్ చేయకుండా ప్రభాకర్ రావుకు కల్పించిన వెసులుబాటును కొట్టేయాలని ఇప్పటికే సిట్ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్.. ఈ కేసు నమోదు కాగానే విదేశాలకు పారిపోయాడు. పోలీసులు ఒత్తిడి, అరెస్ట్ చేయకుండా సుప్రీంకోర్టు రక్షణ కల్పించడంతో తిరిగి హైదరాబాద్ వచ్చారు.

# బీఆర్ఎస్‌కు 'స్థానిక' పరీక్ష! కాంగ్రెస్ వైఫల్యాలే బీఆర్ఎస్ టార్గెట్

హైదరాబాద్,వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో కేటీఆర్ జిల్లా అధ్యక్షులకు పిలుపునిచ్చినప్పటికీ చివరికి తాజా, మాజీ ఎమ్మెల్యేలదే ఆధిపత్యమనేది బహిరంగ అంశం. అధికారంలో ఉన్నప్పుడే 33 జిల్లాలకు పార్టీ జిల్లా అధ్యక్షులను నియమించారు. ఈ జిల్లా అధ్యక్షులు పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కార్యక్రమాలకు నామమాత్రంగా అధ్యక్షత వహించడం తప్ప చేసిందేమీలేదు. అప్పట్లోనే వారిని ఎమ్మెల్యేలు పట్టించుకోలేదని, తాజా పరిస్థితిల్లో వారి మాటను ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేలు వింటారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.అధికారం కోల్పోయిన తర్వాత మొదటిసారిగా ఎదురవుతున్న స్థానిక ఎన్నికల పరీక్ష నుంచి బీఆర్ఎస్ ఎలా గట్టెక్కుతోందనే చర్చ ఆ పార్టీలో జోరుగా సాగుతోంది. పార్టీ అధిష్ఠానం, పేరుకు జిల్లా అధ్యక్షులు తప్ప నిర్మాణం లేని ఈ స్థితిలో క్యాడర్‌ను ఎన్నికల వైపు ఎలా నడిపిస్తారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నియోజకవర్గాల్లో పాత బాసులదే హవా సాగుతున్న స్థితిలో నేటికీ కొనసాగుతున్న అసమ్మతి కుంపట్లను ఏ విధంగా చల్లార్చుతారనే చర్చలు నడుస్తున్నాయి. అనధికారికంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జులుగా కొనసాగుతున్న ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేలలో మెజార్టీ నాయకులకు అసమ్మతి ఉన్నప్పటికీ ఆర్థికం, హంగూ, ఆర్భాటానికి మాత్రం ఒకరిద్దరు మినహా మెజార్టీ బలంగా ఉన్నారనే అభిప్రాయం ఉంది. ప్రభుత్వ పైన వ్యతిరేకత, ఇచ్చిన హామీల అమలులో జాప్యం వంటి వాటిపై బీఆర్ఎస్ భారీ ఆశలు పెట్టుకున్నట్లు భావిస్తున్నారు. పార్టీలో కొనసాగుతున్న గ్రూపులను ఐక్యం చేసి ముందుకు నడిపించడం పైన్నే ఆ పార్టీ విజయావకాశాలుంటాయని భావిస్తున్నారు.

### పార్టీ గుర్తింపు దక్కని నాయకులు

నేటికీ పార్టీలో కేసీఆర్ కుటుంబంలోని నలుగురైదుగురితో పాటు పోయినోళ్ళుపోగా మిగిలినవారికి జిల్లా అధ్యక్షులనే ట్యాగ్ తప్ప మరొకరికి పార్టీ హోదా లేకపోవడం గమనార్హం. శాసనసభా పక్షనేతగా కేసీఆర్ మినహా మిగిలిన ఉప పదవుల పంపిణీ కూడా జరగలేదు. ఏప్రిల్ 27న ఎల్కతుర్తి వేదికగా పార్టీ 25వ ఆవిర్భావ దినోత్సవాన్ని లక్షల మందితో నిర్వహించినప్పటికీ.. కేసీఆర్ ఒక్కరిదే ప్రసంగం. వేదికపైన బ్యాక్‌డ్రాప్‌లో కేసీఆర్, కేటీఆర్ చిత్రాలే. సభ ప్రచార పోస్టర్లలోనూ వాళ్లిద్దరి ఫొటోలే. సభ తర్వాత కమిటీల నిర్మాణం చేస్తామని ప్రకటించినప్పటికీ ఆ ఊసే లేకుండా పోయిందని క్యాడర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నది. బీఆర్ఎస్ ఎదుర్కొంటున్న నేటి దుస్థితి.. చేజేతులా కొనితెచ్చుకున్నదేననే అభిప్రాయం ఓ మోస్తరు నాయకుల్లోనూ బలంగా ఉన్నది. గుప్పెడు మంది నాయకులకు తప్ప మరొకరికి గుర్తింపులేకపోవడంతో క్షేత్రస్థాయిలో ఇతర రాజకీయ పక్షాల నుంచి అవహేళనను సైతం ఎదుర్కొంటున్నామని ఒక నాయకుడు ఆవేదన వ్యక్తం చేశారు.

### క్యాడర్ ఎంతున్నా నిర్మాణం సున్నా

బీఆర్ఎస్‌కు కావాల్సినంత మంది క్యాడర్ ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో నిర్మాణం లేకుండా పోయింది. ఈ స్థితిలో పార్టీని స్థానిక ఎన్నికలకు గ్రామస్థాయి నుంచి సన్నద్ధం చేయడమంటే జిల్లా అధ్యక్షులకు అగ్నిపరీక్షేనని అంటున్నారు. నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి సమావేశాల నిర్వహణ సందర్భంగా నిర్మాణ సమస్యలు తలెత్తే అవకాశం ఉందంటుంటున్నారు. ఆ పరిస్థితి రాకూడదంటే గంపగుత్త వ్యవహారంగా సమావేశాలు నిర్వహించాల్సిన పరిస్థితి ఉందంటున్నారు. ఈ కారణంగానే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని పార్టీ నాయకులు, శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చిన సందర్భంగా కూడా ఇదే విషయాన్ని గుర్తించారని అంటున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులే బాధ్యత వహించి నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.



మాజీ ఎమ్మెల్యేలదే ఆధిపత్యం

వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో కేటీఆర్ జిల్లా అధ్యక్షులకు పిలుపునిచ్చినప్పటికీ చివరికి తాజా, మాజీ ఎమ్మెల్యేలదే ఆధిపత్యమనేది బహిరంగ అంశం. అధికారంలో ఉన్నప్పుడే 33 జిల్లాలకు పార్టీ జిల్లా అధ్యక్షులను నియమించారు. ఈ జిల్లా అధ్యక్షులు పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కార్యక్రమాలకు నామమాత్రంగా అధ్యక్షత వహించడం తప్ప చేసిందేమీలేదు. అప్పట్లోనే వారిని ఎమ్మెల్యేలు పట్టించుకోలేదని, తాజా పరిస్థితిల్లో వారి మాటను ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేలు వింటారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే పలు జిల్లాల్లో మాజీ ఎమ్మెల్యేలే నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నా.. జిల్లా అధ్యక్షులు హాజరుకావడం లేదంటే ఆ పార్టీలో వారి స్థానమేమిటో అర్థం చేసుకోవచ్చు.

### నేటికీ అసమ్మతి కుంపట్లు

రాష్ట్రవ్యాప్తంగా కొన్నిచోట్ల మినహా మెజార్టీ నియోజకవర్గాల్లో గత పదేండ్లు దాదాపు ఒక్కరే ఎమ్మెల్యేగా కొనసాగారు. పదేండ్లలో నియోజకవర్గంలో వారు చెప్పిందే వేదం, వారు చేసిందే పని అన్నట్లుగా సాగింది. దీంతో గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు మెజార్టీ నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేల తీరుపై తిరుగుబాట్లు వచ్చాయి. జనగామ, స్టేషన్ ఘన్ పూర్, మానుకోట, వర్ధన్నపేట చివరికి నర్సంపేట, పరకాల, పాలకుర్తిలాంటి చోట్ల కూడా బహిరంగంగా వ్యతిరేకించారు. జనగామ, స్టేషన్ ఘన్ పూర్ లాంటి చోట్ల తప్ప పెద్దగా సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చలేదు. పర్యవసానంగా మెజార్టీ స్థానాల్లో ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి దాదాపు ఈ 20 నెలల కాలంలో పార్టీ నిర్మాణపరమైన మార్పులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల మార్పులకు అవకాశమే లేకుండాపోయింది. ఈ పరిస్థితుల్లో తిరిగి వారే ఆయా నియోజకవర్గాల్లో అనధికార ఇన్‌చార్జులుగా, పార్టీ ఏకైక బాసులుగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. అదే సమయంలో పార్టీపరమైన సాదకబాధకాలు కూడా వారే తీరుస్తున్నారు. పాత అసంతృప్తులు, అసమ్మతి కుంపట్లు ఇప్పటికీ ఉన్నాయి. ఈ స్థితిలో పార్టీని ప్రక్షాళన చేయకుండా స్థానిక ఎన్నికలను ఎదుర్కోవడమంటే బయటి నుంచి ఇబ్బందులు ఎదుర్కోవడమే కాకుండా ఇంటిపోరు కూడా తప్పకపోవచ్చంటున్నారు. అందుకే కాంగ్రెస్ పాలనా వైఫల్యాలే బీఆరెస్‌కు దిక్కుగా మారాయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే స్థానిక ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేసేందుకు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మొన్నటి శాసనసభ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలు పైన ప్రశ్నించాలని కేటీఆర్ సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హామీలలో వైఫల్యాలను ప్రజలకు తెలియజేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునివ్వడం గమనార్హం.

# నాగం రాజకీయ సన్యాసం?



హైదరాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాలో సీనియర్ మోస్ట్ నాయకుడు నాగం జనార్ధనరెడ్డి. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీలో ఉన్నప్పుడు సీఎం పోస్టు మినహా అన్ని పదవులు అనుభవించిన దిగ్గజం. అలాంటాయన రాజకీయ ప్రస్థానానికి ఫుల్ స్టాప్ పెట్టడానికి డిసైడ్ అయ్యారంట. ఒకప్పుడు తిరుగులేని నాయకుడిగా వెలుగొందిన ఆయన.. తర్వాత పరిణామాలతో తీసుకున్న ఒక్క నిర్ణయంతో అధ:పాతళానికి వెళిపోయారు. నాటి నుండి ఎన్ని ప్రయత్నాలు చేసినా నాగంకు రాజకీయంగా ఏదీ కలిసి రాలేదు. ఇప్పుడు వైరాగ్యంతో రాజకీయాలకు రిటర్మెంట్ ప్రకటించాలని చూస్తున్నారంట.. తన స్థానంలో వారసుడ్ని తీసుకొచ్చేందుకు పొలిటికల్ కోచింగ్ మొదలుపెట్టారంట.. ఇంతకీ నాగం వారసుడు ఎవరు?

### నాగర్‌కర్నూల్ పేరు చెప్తే గుర్తుకొచ్చే నాగం జనార్ధన్‌రెడ్డి

నాగర్ కర్నూల్ నియోజకవర్గం అంటే నాగం అంటే.. నాగర్ కర్నూల్ అంటే నాగం అన్న రీతిలో, తెలుగుదేశం పార్టీ హయాంలో ఒక వెలుగు వెలిగారు నాగం జనార్ధనరెడ్డి. అటు పార్టీలో, ఇటు ప్రభుత్వంలో నెంబరు టూగా ఉమ్మడి రాష్ట్రంలో గట్టిగానే చక్రం తిప్పారు ఆ సీనియర్ నాయకుడు. సుదీర్ఘకాలం పాటు నాగర్ కర్నూల్ ఎమ్మెల్యేగా పనిచేసి చరిత్ర ఆయన సొంతం. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఏడు సార్లు నాగం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడుమంత్రిగా పనిచేసిన నాగం జనార్ధన్ రెడ్డి నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో పట్టు సాదించారు.

### చంద్రబాబుతో విభేదించి టీడీపీకి రాజీనామా

తెలంగాణ ఉద్యమ సమయంలో ఉస్మానియా క్యాంపస్లో తనపై దాడి తర్వాత తెలంగాణా కోసం టిడిపి అధినేతతో విభేదించి పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తన రాజీనామా ఆమోదింప చేసుకోవడం కోసం అసెంబ్లీలో అప్పట్లో ఆయన చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. ఆ క్రమంలో తెలంగాణా నగారా స్థాపించి తెలంగాణా కోసం బలిదానాలు వద్దు కొట్లాడి తెచ్చుకుందామంటూ భరోసా యాత్ర నిర్వహించారు. తిరిగి నాగర్ కర్నూల్ ఉప ఎన్నికల్లో స్వతంత్రుడిగా పోటీ చేసి గెలుపొందారు. తర్వాత తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు కోసం బీజేపీలో చేరారు. బీజేపీ ఆయనకు సముచిత ప్రాధాన్యత కల్పించింది.

### నాగంతో పాటు కుమారుడికి టికెట్ ఇచ్చిన బీజేపీ

నాగం జనార్ధనరెడ్డికి 2014 ఎన్నికల్లో మహబూబ్‌నగర్ ఎంపీ టికెట్ కేటాయించిన బీజేపీ ఆయన కుమారుడు నాగం శశిధర్‌రెడ్డికి నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే టికెట్ కేటాయించింది. అయితే ఆ ఎన్నికల్లో తండ్రి కొడుకులు ఇద్దరు పరాజయం పాలవ్వడంతో రాజకీయంగా ఆయన పతనం ప్రారంభమైందన్న అభిప్రాయం ఉంది. అయితే తర్వాత బీజేపీలో ఇమడలేక 2018 ఎన్నికల నాటికి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన నాగం జనార్దన్‌రెడ్డి 2022 డిసెంబరు 10న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా నియమితురాలయ్యారు. నాగం జనార్ధన్ రెడ్డి 2023 ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ టికెట్ ఆశించగా, కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ నిరాకరించడంతో ఆయన కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి అక్టోబరు 31న తెలంగాణ భవన్‌లో కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

### తన స్థానంలో కుమారుడ్ని తీసుకురావడానికి నాగం సన్నాహాలు

వరుసగా తగులుతున్న ఎదురుదెబ్బలతో నాగం జనార్ధనరెడ్డి రాజకీయాలకు గుడ్ బై చెప్పి తన కుమారుడిని తన ప్లేస్‌లోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారంట.. నాగం వారసుడు శశిధర్‌రెడ్డి ఇప్పటికే ఎమ్మెల్యేగా ఒకసారి పోటీ చేసి పరాజయం పాలయ్యారు. దాంతో డైరెక్ట్ ఎమ్మెల్యేగా కాకుండా లోకల్ లెవెల్ లో కుమారుడు పట్టు సాధిస్తే ఎమ్మెల్యేగా గెలవడం సునాయాసంగా అయితుందని నాగం భావిస్తున్నారంట. ఈసారి జరిగే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున కౌన్సిలర్ అభ్యర్థిగా నాగం శశిధర్ రెడ్డిని రంగాల్లోకి దింపేందుకు గ్రౌండ్ లెవెల్ లో సెట్ చేస్తున్నారట నాగం.. కౌన్సిలర్ గా గెలుపొందితే మున్సిపల్ చైర్మన్‌గా తన కుమారుని కూర్చోబెట్టడం ఈజీ అవుతుందని లెక్కలు వేసుకుంటున్నారంట.. నాగర్ కర్నూల్ మున్సిపల్ పీఠం చేజిక్కించుకోవడానికే ఈసారి గులాబీ పార్టీ తరపున మున్సిపల్ ఎలక్షన్స్ భారం అంతా నాగం జనార్ధన్ రెడ్డే చూసుకుంటున్నారంట

### మర్రి జనార్ధన్‌రెడ్డితో అండర్ స్టాండింగ్‌కు వచ్చిన నాగం

గత అసెంబ్లీ ఎన్నికల్లో నాగర్ కర్నూల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి పోటీ చేశారు.. ఆయన స్వల్ప తేడాతో ఓటమిపాలయ్యారు.. అనంతరం నియోజకవర్గంలో పర్యటనలు, పార్టీ కార్యక్రమాలకు ఆయన దూరంగా ఉంటున్నారు.. వచ్చే ఎమ్మెల్యే ఎన్నికల వరకు తన వ్యాపారాలపై దృష్టి పెట్టాలని ఫిక్స్ అయ్యారంట.. ఆ క్రమంలో రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరుపున అభ్యర్థులను దింపేందుకు నాగం ,మర్రి ఇద్దరు ఒక అండర్‌స్టాండింగ్‌కు వచ్చారంటున్నారు. నాగర్ కర్నూల్ లో ఉన్న 24 వార్డులో సగం టికెట్ల మర్రి జనార్ధన్ రెడ్డి అనుచరులకు , సగం నాగం జనార్ధన్ రెడ్డి అనుచరులకు ఇచ్చేలా అగ్రిమెంట్ కుదుర్చుకున్నారంట.

### నాగర్ కర్నూల్‌లో ప్రతి కార్యక్రమానికి హాజరవుతున్న తండ్రీ కొడుకులు

నాగర్‌కర్నూల్ మున్సిపాల్టీలో మెజార్టీ వార్డులు బీఆర్ఎస్ గెలుచుకునేలా చేసి నాగం జనార్ధన్ రెడ్డి తన కుమారుడిని మున్సిపల్ చైర్మన్ సీట్ పై కూర్చోబెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారట.. దాని కోసం నాగం జనార్ధన్ రెడ్డి తనయుడు నాగం శశిధర్ రెడ్డి పోటీ చేసే వార్డును కూడా సెలక్ట్ చేసుకున్నారని ప్రచారం కూడా జరుగుతుంది. అందుకోసమే ఇప్పటి నుంచే నాగర్ కర్నూల్ లో జరిగే ప్రతి కార్యక్రమానికి ఆ తండ్రి కొడుకులు హాజరవుతున్నారంట. మరి నాగం వారు తన వారసుడి కోసం గీస్తున్న స్కెచ్ ఎంత వరకు వర్కౌట్ అవుతుందో చూడాలి.

# జాతీయ మీడియాలో ఆశ్చర కథనాలు

న్యూఢిల్లీ,ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాపై అనుమానాలను వ్యక్తం అవుతూనే ఉన్నాయి. ఆయన రాజీనామా వెనక లోతైన కారణం ఉంటుందని కాంగ్రెస్ ఆరోపిస్తుంది. అధికార బిజెపి మాత్రం ఎలాంటి వ్ఆయఖ్యలు చేయడం లేదు. అలాగే ధన్‌ఖడ్ కూడా తన రాజీనామాపై ఎలాంటి ప్రకటనా చేయలేదు. మొత్తానికి ఈ సస్పెన్స్ ఇప్పట్లో తెరపడేలా లేదు. ఇదిలావుంటే అనూహ్యంగా ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేసి అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసిన జగ్‌దీప్ ధన్‌ఖడ్ తన రాజీనామాకు ముందు ఎలాంటి ముందస్తు షెడ్యూల్ లేకుండా రాష్ట్రపతి కార్యాలయానికి వెళ్లినట్లు సమాచారం. సోమవారం రాత్రి ఆయన రాష్ట్రపతి భవన్‌ను సందర్శించినట్లు తెలుస్తోంది.సోమవారం రాత్రి 9 గంటలకు ధన్‌ఖడ్ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో భేటీ- అయ్యారని.. తన రాజీనామా లేఖను అందించారని సమాచారం. అరగంట తర్వాత తన రాజీనామా లేఖను 'ఎక్స్'లో ఆయన పోస్టు చేశారు. అయితే.. ఎలాంటి ముందస్తు షెడ్యూల్ లేకుండా ఆయన రాష్ట్రపతి భవన్‌ను సందర్శించడం పలువురిని ఆశ్చర్యపరిచింది.ఎలాంటి ముందస్తు షెడ్యూల్ లేకుండా రాష్ట్రపతి కార్యాలయానికి ధన్‌ఖడ్ రావడంపై రాష్ట్రపతి కార్యాలయ సిబ్బంది మొదట గందర గోళానికి గురైనట్లు- పలు మీడియాల్లో వార్తలు వస్తున్నాయి. రాష్ట్రపతి భవన్‌ను సందర్శించే వారి షెడ్యూల్ చాలా రోజుల ముందుగానే సిద్ధమవుతుంది. అయితే.. ఒక సీనియర్ రాజ్యాంగ నేత ఎలాంటి అపాయింట్‌మెంట్ లేకుండా రాష్ట్రపతి భవన్‌లో కనిపించడం ఇటీవల ఇదే తొలిసారి కావొచ్చని పలువురు పేర్కొంటు-న్నారు. ఇక ధన్‌ఖడ్ రాకతో వెంటనే అప్రమత్తమైన రాష్ట్రపతి భవన్ సిబ్బంది..చివరి నిమిషంలో వీరి భేటీకి అన్ని ఏర్పాట్లు- చేసినట్లు- సమాచారం. ఇక ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ చేసిన రాజీనామాను మంగళవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదించిన విషయం తెలిసిందే. అనంతరం హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ సంతకంతో కేంద్ర హోంశాఖ గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ధన్‌ఖడ్ రాజీనామాతో కొత్త ఉప రాష్ట్రపతి వచ్చేవరకు ఇక రాజ్యసభను డిప్యూటీ-ఛైర్మన్ హరివంశ్ నడపనున్నారు. ఈ క్రమంలో ఉప రాష్ట్రపతి ఎన్నిక ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నిక నిర్వహించడానికి ఈసీ సిద్ధమవుతోంది. ఇందులోభాగంగా లోక్‌సభ, రాజ్యసభలోని ఎలక్టోరల్ కాలేజీ ఎంపీలను సంప్రదిస్తోంది. రిటర్నింగ్ ఆఫీసర్ల పేర్లను ఖరారు చేసేందుకు చర్యలు చేపట్టింది.ఉప రాష్ట్రపతి పదవికి జగ్‌దీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయడంతో.. తదుపరి ఆ పదవిని చేపట్టబోయే వారు ఎవరనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు కొత్త ఉప రాష్ట్రపతి ఎన్నిక ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానున్నట్లు- తెలుస్తోంది. ఎన్నికల ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం మరో 24 గంటల్లోపే ప్రారంభించే అవకాశం ఉన్నట్లు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. కొత్త ఉప రాష్ట్రపతి ఎన్నిక ప్రక్రియ నెల రోజుల్లో పూర్తవుతుందని పార్లమెంట్ వర్గాలు చెబుతున్నాయి. అయితే.. దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు. ఖాళీగా ఉన్న ఉప రాష్ట్రపతి పదవిని సాధ్యమైనంత త్వరలో భర్తీ చేస్తామని అధికార వర్గాలు వెల్లడించాయి. అయితే.. రాజ్యాంగ నిబంధనల్లో నిర్దిష్ట కాలపరిమితి గురించి ప్రస్తావన లేదు. ఇక ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన జగ్‌దీప్ ధన్‌ఖడ్ అధికారిక నివాసాన్ని ఖాళీ చేసిన తర్వాత ఆయనకు దిల్లీలోని లుటియన్స్‌లోని ప్రభుత్వ బంగ్లాను కేటాయిస్తారని సమాచారం. ఇక ప్రభుత్వ ప్రొటోకాల్ ప్రకారం ఆయనకు భద్రత కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. పార్లమెంటు ఉభయ సభల్లోని సభ్యులు ఉప రాష్ట్రపతిని ఎన్నుకుంటారు. ఉప రాష్ట్రపతి ఎన్నికకు పార్లమెంటు-లో ఎన్డీయేకు స్పష్టమైన మెజారిటీ- ఉంది. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతోపాటు రాజ్యసభలో నామినేటెడ్ సభ్యులకూ ఓటుహక్కు ఉంటుంది. లోక్‌సభలో ప్రస్తుతం 542 మంది సభ్యులు ఉన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని బసీర్‌హాట్ సీటు ఖాళీగా ఉంది. రాజ్యసభలో 240 మంది ఉన్నారు. 5 సీట్లు ఖాళీగా ఉన్నాయి. నలుగురు నామినేటెడ్ సభ్యులతో కలిపి ఉభయసభల మొత్తం సభ్యుల సంఖ్య ప్రస్తుతం 786గా ఉంది. ఇందులో మెజారిటీకి 394 మంది మద్దతు అవసరం. లోక్‌సభలో ఎన్డీయేకు 293 మంది సభ్యుల బలముంది. రాజ్యసభలో 129 మంది మద్దతుంది. మొత్తంగా 422 మంది సభ్యులు ఎన్డీయేకు అనుకూలంగా ఉన్నారు. ఉప రాష్ట్రపతిగా ఎన్నికైనవారు మిగిలిన కాలానికి కాకుండా ఐదేళ్లపాటు పదవిలో ఉంటారు.

# దిమ్మతిరిగే నిజాలు వెలుగులోకి

అమరావతి,మద్యపాన నిషేధం అమలు చేస్తానంటూ అధికారంలోకి వచ్చిన జగన్.. తన ఐదేళ్ల పాలనలో ఏకంగా మద్యం కుంభకోణం చేసి 3500 కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారని సిట్ అంటోంది. ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో సిట్ వేసిన 305 పేజీల ఛార్జ్ షీట్ లో ఈ స్కామ్ లో కీలక పాత్ర పోషించినది ఏ 1 రాజ్ కేసిరెడ్డి. అంతే కాదు ఈ డబ్బులతో ఆయన గచ్చిబౌలిలో ఒక ప్లాట్ ఆపై వివిధ ప్రాంతాల్లో 92 ఎకరాల మేర తన తల్లి, తన సంస్థ ఎషాన్ ఇన్ ఫ్రా పేరిట ఈ భూములు కొన్నట్టుగా గుర్తించారు విచారణాధికారులు. ఈ భూముల విలువ 110 కోట్ల మేర ఉంటుందంటున్నారు.ఇదిలా ఉంటే ఈ బినామీ సొమ్మును పరి పరివిధాలుగా ఖర్చు చేయడానికి రాజ్ కేసిరెడ్డి, అతడి అనుచర గణం.. ప్రయత్నంచినట్టు తెలుస్తోంది. జాంబియా, టాంజీనియా వంటి ఆఫ్రికన్ దేశాల్లో మైనింగ్ చేయడానికి గల అవకాశాలు కూడా వీరు పరిశీలించినట్టు కనిపిస్తోంది. ఈ దిశగా వీరు ఆయా దేశాలకు ట్రిప్పులు వేసినట్టు కూడా గుర్తించారు విచారణాధికారులు. యూఏఈ, యూకేల్లోనూ రకరకాల కంపెనీలు స్థాపించినట్టు గుర్తించారు. ఇందుకోసంగానూ రాజ్ కేసిరెడ్డి అండ్ కో ఏకంగా 28 సార్లు ఫారిన్ టూర్లు వేసినట్టుగా తెలుస్తోంది.ఇక ఎన్నికల్లో నగదు పంపకాల కోసం ఎంత మొత్తం వాడారని చూస్తే.. సుమారు 200 కోట్ల రూపాయల మేర.. ఈ మద్యం డబ్బులోంచి వాడినట్టు సిట్ గుర్తించింది ఇందుకోసం హైదరాబాద్, తాడేపల్లిలో కొన్ని స్థావరాలను ఏర్పాటు చేసినట్టు చెబుతున్నారు విచారణాధికారులు. ఇదంతా ఏ 38 చెవిరెడ్డి అధ్వర్యంలో నడిచినట్టు సమాచారం. ఈయన సూచనల మేరకు ఎక్కడెక్కడి నుంచి ఎంతెంత మొత్తం సొమ్ము ఎక్కడికి తరలించాలో పథక రచన చేసినట్టు చెబుతున్నారు. ఒక సారికి ఒక ట్రిప్పులో 8 నుంచి 12 కోట్ల రూపాయల మేర సొమ్ము తరలించినట్టు తెలుస్తోంది. ఇందుకు తుడా వాహనాలను సైతం వాడినట్టు గుర్తించారు.ఇలా ఎన్నికలను ప్రభావితం చేయడానికి కూడా ఈ మద్యం సొమ్ము వాడినట్టు గుర్తించింది సిట్. ఇప్పటి వరకూ అరెస్టయిన వారిలో మిథున్ రెడ్డి రెండో రాజకీయ ప్రతినిథి కాగా.. మిగిలిన వారు ఎప్పుడన్నది ఉత్కంఠగా మారింది. ఏ5 విజయసాయిరెడ్డి ఎప్పుడు అరెస్టు అవుతారన్నది సస్పెన్స్ గా మారింది. అయితే ఆయన పార్టీ నుంచి బయటకొచ్చి.. అప్రూవర్ గా మారడానికి సిద్ధంగా ఉన్నారు. అదలా ఉంటే ఆలస్యం అవుతుందేమోగానీ ఆయన అరెస్టు మాత్రం పక్కా అంటున్నారు. ఎందుకంటే విజయసాయిరెడ్డి ఇన్వాల్వ్ మెంట్ ఈ మొత్తం ఇష్యూలో రెండు మూడు ప్రధానమైన ఘట్టాల్లో ఉన్నట్టు సిట్ గుర్తించింది. మరి చూడాలి మంత్రి కొల్లు రవీంద్ర చెప్పినట్టు తర్వాతి బిగ్ వికెట్ ఎవరిదో తేలాల్సి ఉంది.

# పవన్ కౌంటర్ కేటీఆర్ గురించేనా?



హైదరాబాద్,ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల హిందీ భాష ప్రాచుర్యంపై చేసిన వ్యాఖ్యలు దక్షిణాది రాజకీయాల్లో చర్చకు దారితీశాయి. ఆయన నేరుగా ఎవరి పేరునూ ప్రస్తావించకపోయినప్పటికీ, తెలంగాణలోని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గతంలో హిందీ భాషపై చేసిన వ్యాఖ్యలకు పరోక్ష కౌంటర్‌గా పవన్ కళ్యాణ్ మాటలు ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పవన్ కళ్యాణ్ వాదన: హిందీ ఒక కమ్యూనికేషన్ సాధనం

పవన్ కళ్యాణ్ దక్షిణాదిలో హిందీ భాష వ్యాప్తికి మద్దతు తెలుపుతున్నారు. ప్రజలు హిందీ నేర్చుకోవాలని, అది ఒక సాధారణ కమ్యూనికేషన్ సాధనంగా ఎదగాలని ఆయన తరచుగా ఉద్ఘాటిస్తున్నారు. "భాషను రాజకీయంగా చూడరాదు" అనే సందేశాన్ని ఆయన పదేపదే ఇస్తున్నారు. తాను చిన్నప్పుడు హిందీని రెండో భాషగా చదివానని, అప్పట్లో ఎటువంటి సమస్యలు లేవని, ఇప్పుడు ఈ భాషపై దుష్ప్రచారం ఎందుకు జరుగుతోందని ఆయన ప్రశ్నిస్తున్నారు.

కేటీఆర్ వైఖరి: హిందీ జాతీయ భాష కాదు

మరోవైపు తెలంగాణలో కేటీఆర్ హిందీ భాషపై పూర్తి భిన్నమైన వైఖరిని తీసుకున్నారు. ఢిల్లీ పాలకులు హిందీని బలవంతంగా మోపే ప్రయత్నం చేయొద్దని, హిందీని జాతీయ భాషగా ప్రచారం చేయడం సరికాదని ఆయన స్పష్టం చేశారు. "హిందీ జాతీయ భాష కాదు" అని ఆయన చేసిన వ్యాఖ్యలు అప్పట్లో పెద్ద చర్చకు దారితీశాయి.

పవన్ కళ్యాణ్ పరోక్ష దాడి: మోదీ ద్వేషం హిందీపైకి మళ్ళుతోంది

ఈ నేపథ్యంలో పవన్ కళ్యాణ్ చేసిన తాజా వ్యాఖ్యలు గమనార్హం. "తెలంగాణలోని కొంతమంది నేతలు హిందీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. వారి ఉద్దేశాలు నాకు అర్థం కావడం లేదు. బీజేపీ, మోదీపై ఉన్న ద్వేషం వారి హిందీ భాష పట్ల ఉన్న వైరం లోకి మారిపోయినట్టుంది. కానీ ఇప్పుడే ఈ భాషపై అంత దుష్ప్రచారం ఎందుకు?" అని పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు.పవన్ కళ్యాణ్ స్పష్టంగా కేటీఆర్ పేరును ప్రస్తావించనప్పటికీ, హిందీని వ్యతిరేకిస్తున్న రాజకీయ నేతలపై ఆయన చురకలు అంటించారనే అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది. ముఖ్యంగా "మోదీ ద్వేషం హిందీపైకి మళ్ళుతోంది" అనే వ్యాఖ్య నేరుగా కేటీఆర్ భావజాలానికి విరుద్ధంగా ఉంది. కేటీఆర్ తరచుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై, ముఖ్యంగా ప్రధాని మోదీపై విమర్శలు చేస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు కేటీఆర్‌ను ఉద్దేశించినవే అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

-దక్షిణాదిలో కొత్త చర్చకు తెర?

హిందీ భాషపై పవన్ కళ్యాణ్ చూపుతున్న ఆసక్తి, దాన్ని ప్రోత్సహించాలన్న ఆయన తీరు దక్షిణాది రాజకీయ వర్గాల్లో భిన్నంగా చర్చకు దారితీస్తోంది. ఆయన మళ్లీ మళ్లీ భాషపై ప్రసంగించడం, "భాషను రాజకీయంగా చూడరాదు" అనే సందేశం ఇవ్వడం భవిష్యత్తులో ఈ అంశం రాష్ట్రాల్లో నూతన చర్చకు దారితీస్తుందనే అభిప్రాయాన్ని కలిగిస్తోంది. మొత్తంగా చూస్తే, పవన్ కళ్యాణ్ హిందీ భాష ప్రాచుర్యం కోసం కృషి చేస్తున్నప్పటికీ, ఇందులో రాజకీయ కోణం లేకపోలేదన్న విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది.పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు నిజంగా కేటీఆర్‌ను ఉద్దేశించినవేనా? ఈ చర్చ దక్షిణాది రాష్ట్రాల్లో హిందీ భాష భవిష్యత్తుపై ఎలాంటి ప్రభావం చూపుతుంది? అన్నది వేచిచూడాలి.

# మొన్న క్విడ్ ప్రోకో..ఇవాళ కిక్ బ్యాక్స్..

అమరావతి,జగన్ స్టైలే వేరబ్బా. చాలా మంది చంద్రబాబే సంపద సృష్టిలో టాప్ అంటారుగానీ అదంతా ఉట్టిది. ఇది కేవలం రాష్ట్రానికి సంబంధించిన వ్యవహారం. అదే సొంతంగా సంపాదించడంలో జగన్ తర్వాతే ఎవరైనా. గతంలో తండ్రి అడ్డు పెట్టుకుని క్విడ్ ప్రో కో ద్వారా భారీ ఎత్తున అవినీతికి తెరలేపారా? అదే ఇప్పుడు మద్యం కుంభకోణంలో వినిపిస్తున్న కొత్త పదజాలం.. కిక్ బ్యాక్స్. ఈ కిక్ బ్యాక్స్ ఇప్పుడు కరప్షన్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్.కేసిరెడ్డి నుంచి చెవిరెడ్డి వరకూ ఏ1 టు ఏ 38 ఒక సిండికేట్ గా ఏర్పడి.. వీరు చేసిన విధ్వంసం విలువ 3500 కోట్లు. ఈ మొత్తం నాలుగైదు చేతులు మారి ఫైనల్ గా చేరింది జగన్ కే అంటారు. ఛార్జ్ షీట్ లో కూడా జగన్ పేరు ప్రముఖంగానే ప్రస్తావించారు. అయితే జగన్ కి చేరినట్టు గల ఆధారాలు సంపాదించడం అంత తేలికేనా? అన్నదొక ప్రశ్న.గతంలో కూడా జగన్ ఇలాగే.. క్విడ్ కో ప్రో ద్వారా ఎవరికీ చిక్కకుండా చేసిన హడావిడి హంగామా పత్రికల్లో కనిపించింది తప్ప.. పెద్ద గొప్పగా జగన్ ఇరుక్కున్నదేం లేదు. పైపెచ్చు లక్ష కోట్లని చెప్పి చివరికి తేల్చింది 12 వందల కోట్లకన్నా మించి లేదు. దానికి తోడు అవన్నీ కూడా తండ్రి హయాంలో జరిగినవి. కాబట్టి ఇవేవీ పెద్ద నిలబడే కేసులు కావన్న కోణంలో ఉండవల్లి లాంటి వారినోటి నుంచి వినవచ్చిందీ వినే ఉంటాం.ఇపుడీ లిక్కర్ కేసు పరిస్థితేంటి? అన్నదొక చర్చ. ఇందులో పెద్ద పెద్ద తిమింగలాలు బయట పడతాయి, ప్రపంచంలో అతి పెద్ద మద్యం కేసు అని మంత్రి కొల్లు చెబుతున్నారుగానీ.. అతి పెద్ద తిమింగలం ఎవరు? ఆ తిమింగలాన్ని ఎలా అరెస్టు చేస్తారంటే అందుకు తగిన ఆధారాలున్నట్టే కనిపించడం లేదు. రాజ్



కేసిరెడ్డి నుంచి చెవిరెడ్డి వరకూ సాగించిన ఈ లిక్కర్ లీలలో సొమ్మంతా జగన్ కి చేరినట్టు చెబుతున్నారు కానీ అందుకు తగిన ఆధారాలు కేవలం నోటిమాటలుగానే తెలుస్తున్నాయి. ఈ వాంగ్మూలాలతో జగన్ ని బుక్ చేయడం అంటే సాధ్యమయ్యే పనేనా? అన్నది మరొక ప్రశ్న.జగన్ ఎప్పుడూ తన వైపు తప్పు ఉండేలా చేసుకోరు. అది క్విడ్ ప్రో కోలో అయినా, కిక్ బ్యాక్స్ వ్యవహారంలో అయినా. ఎవరెంత మొత్తుకున్నా.. ఆయనకంటూ ఒక లూప్ హోల్ పెట్టుకుని అందులోంచి తప్పించుకోవడం తనదైన కరెప్షన్ స్టైల్. కాబట్టి ఆ తిమింగలం అంత తేలిగ్గా చిక్కేది కాదని అంటారు కొందరు న్యాయనిపుణులు.

# పాపం కృష్ణా, గుంటూరు జిల్లా కమ్మ నేతలకు ఇక ఛాన్స్ లేదా?

అమరావతి,తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తుంది. అయితే ప్రస్తుత మంత్రి వర్గంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసంతృప్తిగా ఉన్నారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో మంత్రులపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో కొందరు నేతలు విస్తరణపై ఆశలు పెట్టుకున్నారు.సీనియర్ నేతలతో పాటు గుంటూరు,కృష్ణా జిల్లాకు చెందిన కమ్మ సా మాజికవర్గం నేతలు కూడా తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఈ రెండు జిల్లాలకు చెందిన కమ్మ సామాజికవర్గానికి చెందిన నేతలకు కేబినెట్ లో ఐదేళ్లు అవకాశం దక్కే ఛాన్స్ లేదంటున్నారు. కమ్మ సామాజికవర్గానికి చెం దిన వారు కావడమే మంత్రి వపదవి దక్కకపోవడానికి ప్రధాన కారణంగా చెప్పాలి.

ఐదుగురు ఉండటంతో...

ఇప్పటికే చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో ఐదు గురు కమ్మ సామాజికవర్గం నేతలు ఉండటమే అందుకు కారణం. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు మంత్రులుగా నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్ లు కేబినెట్ లో ఉన్నారు. ఇందులో నలుగురు టీడీపీకి చెందిన వారు కాగా, ఒక్కరు జనసేనకు చెందిన వారు.ఇప్పుడు మంత్రి వర్గ విస్తరణ జరిగినా చంద్రబాబును తప్పిస్తే మిగిలిన నలుగురిని కేబినెట్ నుంచి తప్పించే అవకాశాలు లేవనే చెప్పాలి. ఎందుకంటే వీరు యాక్టివ్ గా ఉండటంతో పాటు ప్రాంతాల వారీగా పట్టున్న నేతలు. రాయలసీమలో పయ్యావుల కేశవ్, గుంటూరు జిల్లాలో నాదెండ్ల మనోహర్, నారా లోకేశ్, ప్రకాశం జిల్లా నుంచి గొట్టిపాటి రవికుమార్ లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

నలుగురిని తప్పించే...

ఈ నలుగురిని తప్పించే అవకాశం లేకపోవడంతో గుంటూరు జిల్లా కమ్మ సామాజికవర్గం ఎమ్మెల్యేలు ఇక మంత్రి పదవిపై ఆశ వదులకోవాల్సిందే. గుంటూరు జిల్లాలో సీనియర్ నేతలు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, ప్రత్తిపాటి పుల్లారావు, యరపతినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ లాంటి వాళ్లున్నారు. గుంటూరు జిల్లాలో ఇప్పటికే నారా లోకేశ్, నాదెండ్ల




మనోహర్ ఉండటంతో మరొకరికి మంత్రి పదవి దక్కే అవకాశం లేదు. అందుకే వీరిలో కొందరికి మాత్రం ఏదో ఒక కేబినెట్ ర్యాంక్ పదవి దక్కే అవకాశాలున్నాయంటున్నారు. గుంటూరు జిల్లాకు చెందిన కమ్మ సామాజికవర్గం ఎమ్మెల్యేలు మాత్రం ఈ దఫా కేబినెట్ లో చోటు దక్కడం కష్టంగానే ఉంది.

సీనియర్లు లేకపోవడంతో...

ఇక కృష్ణా జిల్లాలో కమ్మ సామాజికవర్గం నేతలున్నప్పటికీ వారిలో పెద్దగా సీనియర్లు లేకపోవడం కొంత కలసి వచ్చే అంశమే. గుడివాడ, గన్నవరం ఎమ్మెల్యేలు తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన వారే. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఒకరకంగా సీనియర్ అనే చెప్పుకోవాలి. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక బీజేపీ నుంచి కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, సుజనా చౌదరి కూడా ఆ సామాజికవర్గమే అయినా బీజేపీ కేంద్ర నాయకత్వం విస్తరణలో వీరిద్దరికీ చోటు కల్పిస్తుందని చెప్పలేని పరిస్థితి. ఇందులో కామినేని సీనియర్. సుజనా చౌదరి తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. కృష్ణా జిల్లాలో బీసీ వర్గానికి చెందిన కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారధి కూడా ఉండటంతో కూటమిలోని కమ్మ సామాజికవర్గం నేతలకు కేబినెట్ లో చోటు దక్కే ఛాన్స్ లేదు.

# పరిశ్రమలు రావాలి....ఉపాధి దక్కాలి



హైదరాబాద్,తెలంగాణకు కొత్త పరిశ్రమలు రావాలి... ఇక్కడి యువతకు ఉపాధి దక్కాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సీఐఐ, ఫిక్కీ, ఎఫ్ టీసీసీఐ, ఎలీప్, టిఫ్, టాప్మా, టీ-ఎస్ టీ-ఎంఏ తదితర పారిశ్రామిక సంఘాల ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 'తెలంగాణ పురోగతిలో భాగస్వామ్యమవుతున్న పారిశ్రామికవేత్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటాం అన్నారు. చట్టాలు, నిబంధనల పేరిట వారిని ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశం మాకు లేదు. రాష్ట్రంలోని ప్రతి పరిశ్రమను కాపాడుకుంటాం. ముఖ్యంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న ఎంఎస్ఎంఈ రంగానికి అండగా ఉంటాం. అలాగే... కార్మికుల ప్రయోజనాలను కాపాడుతాం అని వివరించారు. 'గత ప్రభుత్వం మాదిరిగా ఏకపక్షంగా వ్యహరించం. మాది అందర్నీ కలుపుకుని పోయే ప్రభుత్వం. రాష్ట్రాభివృద్ధి కోసం అందరి సలహాలు, సూచనలు స్వీకరిస్తాం. వాటిని ఆచరణలో పెడతాం. పారిశ్రామికాభివృద్ధికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ ప్రయాణంలో పరిశ్రమలను భాగస్వామ్యం చేయాలని నిర్ణయించాం. అందుకే... పలు పారిశ్రామిక సంఘాల ప్రతినిధులతో సమావేశమై రాబోయే రోజుల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై మేధో మథనం చేశాం' అని పేర్కొన్నారు. 'పారిశ్రామికాభివృద్ధిలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా మారింది. ఏడాదిన్నర వ్యవధిలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రానికి కొత్తగా రూ.3 లక్షల కోట్లకు పైగా పెట్టు-బడులను తీసుకొచ్చాం. ప్రైవేట్ రంగంలో లక్ష మందికి పైగా ఉపాధి కల్పించాం. అయినా... రాష్ట్రం నుంచి పరిశ్రమలు తరలి వెళ్లిపోతున్నాయంటూ బీఆర్ఎస్, బీజేపీ మాపై దుష్ప్రచారం చేస్తుంది' అని కొత్తగా రాష్ట్రానికొచ్చిన పెట్టుబడుల గురించి సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులకు వివరించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి తీసుకుంటు-న్న చర్యలపై అవగాహన కల్పించారు. సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. పరిశ్రమలు ఎదుర్కొంటు-న్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో తెలంగాణ మినమం వేజెస్ అడ్వైజరీ బోర్డ్ ఛైర్మన్ బి.జనక్ ప్రసాద్, ఐటీ-, పరిశ్రమల శాఖ స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు సమీవుద్దీన్, రాజీవ్ వెంకటరమణ, రాంచంద్రారావు, శేఖర్ రెడ్డి, జయదేవ్, రాజీవ్, సుజాత, రమాదేవి, సుధీర్ రెడ్డి, సునీల్, గౌతమ్, అరుణ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రాజకీయం: దత్తాత్రేయకు ఉపరాష్ట్రపతి పదవి !

హైదరాబాద్,తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రాజకీయాల్లో పీహెచ్‌డీలు చాలా చేశారు. ఇతర పార్టీలను ఇరుకున పెట్టడానికి ఆయన చేసే డిమాండ్లు అలాగే ఉంటాయి. కులగణనపై కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకంటూ ఢిల్లీ వెళ్లిన రేవంత్ ఓ ప్రెస్మీట్ పెట్టారు. అందులో ఉపరాష్ట్రపతి పదవిని దత్తాత్రేయకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ పదవికి ..బీసీలకు లింక్ పెట్టేశారు.దత్తాత్రేయకు ఉపరాష్ట్రపతి పదవి ఇవ్వడం ద్వారా బీసీలను గౌరవించినట్లుగా అని.. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని గుర్తించినట్లుగా అని రేవంత్ చెబుతున్నారు. అదే సమయంలో బీసీల నాయకత్వాన్ని అణిచివేస్తున్నారని బండి సంజయ్ పేరును కూడా ప్రస్తావించారు. బీసీలకు పెద్ద పీట వేసేందుకు దత్తాత్రేయను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటిస్తే.. ఇండి కూటమి పార్టీలతో తానే మాట్లాడి మద్దతు పలికేలా చూస్తానని కూడా ప్రకటించారు.రేవంత్ డిమాండ్ బీజేపీ ఇబ్బందికరమే అనుకోవచ్చు. ఎందుకంటే.. ఉపరాష్ట్రపతి పదవి విషయంలో చాలా పేర్లు ప్రచారంలోకి వస్తున్నాయి కానీ దత్తాత్రేయ పేరు లేదు. ఆయన రిటైర్మెంట్ వయసు వచ్చేసింది. హర్యానా, హిమాచల్ ప్రదేశ్ లకు గవర్నర్ గా చేశారు.



పదవి కాలం ముగిసింది. అయితే బీజేపీ నేతల్ని పావులుగా వాడుకుని.. బీసీల విషయంలో బీజేపీని టార్గెట్ చేయడం రేవంత్ కే సాధ్యమనుకోవాలి.

# సీఐడీ సంజయ్‌కు ముందస్తు బెయిల్‌పై సుప్రీంకోర్టు ఆశ్చర్యం!



న్యూఢిల్లీ,అగ్నిమాపక శాఖ డీజీగా పని చేసినప్పుడు చేసిన అవినీతి వ్యవహారంలో నమోదైన కేసులో సీనియర్ ఐపీఎస్ అధికారి, మాజీ సీఐజీ చీఫ్ సంజయ్‌కు హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్ తీర్పును చూసి సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. చాలా పేజీలున్న తీర్పును చూసి.. ముందస్తు బెయిల్ పై పిటిషన్ వేస్తే.. అసుల కేసు మొత్తం విచారణ జరిపినట్లుగా ఉందని వ్యాఖ్యానించారు. ఈ కేసులో అవినీతికి పాల్పడినట్లుగా సాక్ష్యాలు అయిన ఇన్వాయిస్‌లు, ఒప్పంద పత్రాలను సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను 30వ తేదీకి వాయిదా వేసింది.సంజయ్, ఫైర్ సర్వీసెస్ డీజీగా ఉన్నప్పుడు, అగ్ని-ఎన్ఓసీ వెబ్ పోర్టల్, మొబైల్ యాప్ అభివృద్ధి, హార్డ్‌వేర్ సరఫరా కోసం విజయవాడకు చెందిన సౌత్రిక టెక్నాలజీస్ అండ్ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్‌కు కాంట్రాక్ట్ ఇచ్చారు. ఈ కాంట్రాక్ట్ కోసం టెండర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని, పోటీ ధరలు పొందకుండా, నిబంధనలను ఉల్లంఘించి కాంట్రాక్ట్ ఇచ్చారని కేసు నమోదు అయింది. 2023 ఫిబ్రవరి 22న, ఒప్పందం జరిగిన ఒక వారంలోనే సౌత్రిక టెక్నాలజీస్‌కు రూ. 59.93 లక్షలు చెల్లించారు. కానీ పనేమీ చేయలేదు.అగ్ని యాప్ అమలు కోసం ఫైర్ సర్వీసెస్ అధికారుల కోసం 8 మైక్రోసాఫ్ట్ సర్ఫేస్ ప్రో 8 డివైస్‌లు, 2 ఆపిల్ ఐప్యాడ్ ప్రో డివైస్‌లను కొనుగోలు చేశారు. వీటిని కూడా అధిక ధరలకు సౌత్రిక టెక్నాలజీస్ నుండి కొనుగోలు చేశారు. ఈ కొనుగోళ్ల కోసం ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు ఆహ్వానించకపోవడం, పోటీ కొటేషన్లు పొందకపోవడం వంటి నిబంధనల ఉల్లంఘనలు జరిగాయని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నివేదికలో పేర్కొన్నారు.అలాగే సీఐడీ అడిషనల్ డైరెక్టర్ జనరల్‌గా ఉన్నప్పుడు అట్రాసిటీ చట్టంపై అవగాహన సదస్సులు, వర్క్‌షాప్‌ల పేరుతో కృత్యాప్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రూ. 1.19 కోట్లు చెల్లించారు. కానీ అసలు ఈ సంస్థ ఏ సదస్సులూ నిర్వహించలేదు. ఈ ఆరోపణలపై సంజయ్‌ను 2024 డిసెంబర్ 3న సస్పెండ్ చేసింది. అయితే సంజయ్‌కు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నుండి షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరైంది, కానీ ఈ కేసుపై సుప్రీంకోర్టులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సవాల్ చేసింది.

# ప్రభుత్వం పట్టించుకోకపోతే.. ప్రజలే తిరగబడతారు: మాజీ ఐపీఎస్



అమరావతి,ఏపీకి చెందిన మాజీ ఐపీఎస్ అధికారి, వైసీపీ హయాంలో ఇబ్బందులు పడిన ఏబీ వెంకటేశ్వరరావు తాజాగా సంచలన ఆరోప ణలు చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు అనేక ఇబ్బందులు పడిన, అనేక అరాచకాలకు గురైన ప్రజలు మంచి ప్రభుత్వం రావాలని గత ఎన్నికల్లో ఓటేసి గెలిపించారని.. అయితే.. ప్రభుత్వం మారినా.. కూడా ప్రజలకుఎక్కడా సంతోషం కనిపించ డం లేదన్నారు. వైసీపీ నుంచి కొందరు గూండాలు.. పార్టీ మారి అధికార పార్టీలోకి చేరి.. అరాచకాలను, దాడులను కొనసాగిస్తున్నారని ఆయన ఆరోపించారు. తాజాగా ఓ ప్రభుత్వ కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్టాడారు. ఈ సందర్భంగా పలువురు బాధిత మహిళల పక్షాన వెంకటేశ్వరరావు మాట్లాడారు.వైసీపి గూండాలు పార్టీ మారి అచ్చోసిన ఆంబోతుల్లా ప్రజలపై పడుతున్నారని వెంకటేశ్వరరావు అన్నారు. పార్టీ మారినంత మా త్రాన ఆంబోతులు, ఆవులైపోవు కదా.. ఈ విషయాన్ని పార్టీలు ఎందుకు గుర్తించడం లేదని ప్రశ్నించారు. మహిళలు అనికూడా చూడకుండా దాడులు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. గత వైసీపీ హయాంలో ఐదేళ్లు దోచుకున్నారని.. ప్రజలను భయ భ్రాంతు లకు గురి చేశారని అన్నారు. ఇప్పుడు కూడా అదే స్ఫూర్తి కొనసాగుతోందన్నారు. ప్రజలను భయ భ్రాంతులకు గురి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారని చెప్పారు. అంతేకాదు.. ప్రభుత్వ కార్యాలయాలు, పోలీసులు కూడా వైసీపీ నుంచి వచ్చిన గూండాలకు దాసోహం చేస్తున్నాయని.. తీవ్ర వ్యాఖ్యలు చేశారు.ప్రభుత్వం, నాయకులు చర్యలు తీసుకోకపోతే... బాధిత ప్రజలే చాటలు, చీపుర్లతో తిరగబడే రోజు వస్తుందని మాజీ డీజి ఎబి వెంకటేశ్వరరావు వ్యాఖ్యానించారు. దీనిని చాలా సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన కొందరి పేర్లు చెబుతూ.. వారంతా వైసీపీ హయాంలో గూండాల మాదిరిగా వ్యవహరించారని అన్నారు. వారి పీడ నుంచి ప్రజలు బయట పడాలన్న ఉద్దేశంతోనే కూటమి ప్రభుత్వాన్ని ఎంపిక చేసుకున్నారని.. కానీ, వారే ఇప్పుడు పార్టీలు మారి.. ప్రజలను నంజుకు తింటున్నారని అన్నారు. ప్రతి పనికీ దోపిడీ చేస్తున్నారని అన్నారు.అన్నింటిలోనూ కమీషన్లు వసూలు చేసుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వం ఈ విషయంలో కళ్లు తెరవకపోతే.. సంబంధిత మంత్రులు స్పందించకపోతే.. ప్రజలే తిరగడే రోజులు వస్తాయని వ్యాఖ్యానించారు. చీపుర్లు, చాటలతో ప్రజలు తిరబడతారని హెచ్చరించారు. కొన్ని స్వయం సహాయక బృందాల మహిళలకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేసింది. అయితే.. వీటి విషయంలో నకిలీ గ్రూపులు ఉన్నాయంటూ.. తూర్పుగోదావరి జిల్లాలో పెద్ద అలజడి రేగింది. ఈ విషయంలో జోక్యం చేసుకున్న ఓ నాయకుడు మహిళలను బెదిరింపులకు గురి చేశారు. ఇది జరిగి రెండు రోజులు అయింది. తాజాగా వెంకటేశ్వరరావు ఎంట్రి ఇచ్చి.. సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం.

# కంచగచ్చిబౌలి భూములపై విచారణ...

న్యూఢిల్లీ, కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. వాదనలు విన్న అనంతరం ఈ విచారణని ఆగస్టు 13వ తేదీకి సుప్రీంకోర్టు వాయిదా వేసింది. కంచ గచ్చిబౌలి భూముల్లో చేపట్టిన పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన చర్యలపై తెలంగాణ ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌పై రి÷-లపై దాఖలుకు ప్రతివాదులు సమయం కోరారు. ప్రతివాదుల విజ్ఞప్తి మేరకు తదుపరి విచారణను ఆగస్టు 13వ తేదీకి వాయిదా వేసింది సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం అన్ని చర్యలు తీసుకున్నట్లు- తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొంది ప్రభుత్వం. కంచ గచ్చిబౌలి భూముల్లో అనుమతులు లేకుండా చెట్లు- కొట్టేసిన వ్యవహారంపై సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది సుప్రీంకోర్టు. గత విచారణ సందర్భంగా... స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేయాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో తీసుకున్న చర్యలను అఫిడవిట్ రూపంలో తెలంగాణ ప్రభుత్వం స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేసింది.

Printed, Published & Owned by **MEDE SHANTHI KUMAR**, Printed at **SPOORTHI PRINTERS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From **SPOORTHI PUBLICATIONS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: **MEDE SHANTHI KUMAR.**